

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

సంపూర్ణ జీవనం... సద్గురుపథం....



విజయదశమి సంచిక




# గురుకృప

సంపుటి : 15 సంచిక : 5

అక్టోబర్ 24 2012





## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో


'నేను' - గురువు 3
- గురుకృప

ప్రేమ తత్త్వం 6
- శరచ్చంద్రికలు

పూర్ణ అవధూత శ్రీపూండీస్వామి 19
- శరచ్చంద్రికలు

ఆధ్యాత్మిక కమ్యూనిజం 24
- గురుకృప

ఇంకాకొన్ని...



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# 'నేను' - గురువు

'అక్షరాలతో అనుభూతులు' అన్న ఈ శీర్షిక శ్రీ మోపిదేవి కృష్ణస్వామిగారి కలం నుండి జాలువారినది. సద్గురు సన్నిధానంలో మన నడవడి, జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవడానికి మనం నడవాల్సిన దారిని చూపే ఈ శీర్షిక సద్గురుపథంలో సాగే ప్రతి బాటసారికి ఒక చక్కని పాఠమేననడంలో అతిశయోక్తి లేదు. మనందరికి ఈ శీర్షిక ఇటు సద్గురు స్మరణను, అటు సద్గురు బోధను అందించగలదన్న సత్సంకల్పమే ఈ ప్రచురణ. అవధరించండి! ఆచరించడం మరువకండి! ఈ శీర్షికను ప్రచురించడానికి అనుమతించిన శ్రీ పట్టాభి రామకృష్ణగారికి గురుకృప ధన్యవాదాలు తెలుపుతోంది. సద్గురు సన్నిధిన ఒక శిష్యుడు పొందిన అనుభూతియే "అక్షరాలతో అనుభూతులు". ప్రథమ సమాగంలో గురువే సర్వస్వం – అంతా గురుమయంగా అనుభూతి చెందడం గురుశిష్య సంప్రదాయంలో ఎరిగిన సత్యం. తన చుట్టూ వున్న రూపములందు, సన్నివేశములందు గురువే ప్రతిధ్వనిస్తూ వుంటాడు. శిష్యుని ప్రతి సంభాషణమున గురు ప్రస్తావనే వుంటుంది. గురువు లేని ఏ విషయమందు రుచి ఉండదు. అందంలోను, అన్ని సన్నివేశములలోను గురువు నాస్వాదించుకొని ప్రవర్తనను మలచుకుంటూ ఉంటాడు శిష్యుడు. అట్టి సులువులను, నేర్పుని, పొందేందుకు వారి అనుభూతులు మనకు మార్గ దర్శనములు. **గురువే ఎల్ల శరీరధారుల రూపముగా అవతరించెనని మరువనంత వరకు ఏ సాంప్రదాయమైనను సమ్మతమే.**

గురువు(గారి)కి ఎదురుగా ఒక నడివయస్కుడు దీనవదనుడై కూర్చుని వున్నాడు. గురువుగారు అతనివైపు చూస్తున్నారు. ఆ చూపులో కొంత మందలింపు, కొంత ఓదార్పు. ఆ సన్నిధిలో కూడదీసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఆ దీనవదనుడు ఇలా అన్నాడు.

**అతడు :** "అదేమి చిత్రమో! అది ఒక వైభవం. జీవితం ఒక వెలుగు వెలిగింది. అంతలోనే ఎందుకు మాయమయింది" అదే నాకు అంతుపట్టడం లేదు. ఒకప్పుడు నేనెక్కడున్నానో అని వెతుక్కుంటూ వచ్చేవారు జనం. ఇప్పుడు నేను ఎక్కడ వున్నానో ఎవ్వరికీ అక్కరలేదనుకుంటాను. ఎందుకు ఇలా! దయచేసి మీరు నాకు వివరించి చెప్పాలి. నాకు మనశ్శాంతి కావాలి. అది మీరివ్వాలి. (అతని కళ్లనుండి అశ్రువులు రాలుతున్నాయి)

**గురువు :** మీ స్థితి నీకర్థమైంది. దానికదిగా జరుగుతున్న దానిని అలా జరగనిస్తే బాగుండేది. మధ్యలో మీరు అడ్డుపడ్డారు. అది ఆగిపోయింది.

**అతడు :** "నేనా! అడ్డుపడింది నేనా" (చూపులతోనే)



**గురువు :** "అవును, అక్షరాలా మీరే". ప్రసరిస్తున్న వెలుగును వెలుగుగా చూడక ఇది నాదీ అని మీకనిపించింది. దానికి శరణాగతి చెందవలసిన మీరు దానిని మీ సొత్తుగా భావించారు. 'నేనూ' దైవమే అనడంలో తప్పులేదు. 'నేనే' దైవం అంటే తప్పు. నేనూ దైవమే అని గ్రహించినప్పుడు మనిషి మహనీయుడు అవుతున్నాడు. నేనే దైవం అని అహంకరించినపుడు మనిషి రాక్షసుడవుతున్నాడు. మన పురాణాలలోని రాక్షసుల కథలన్నీ ఏమిటి? వాళ్లేమీ తక్కువ వాళ్లు కారు. తపస్సంపన్నులే, వెలుగు చూసినవారే, కాని ఆ వెలుగును సొంతం చేసుకుందామనుకున్నారు వాళ్లు. తామే దైవమని అహంకరించారు. వాళ్లు అక్కడే పడిపోయారు మీరు కూడా.

నిజంగా మనకు దైవదర్శనం లభించింది అనడానికి సంకేతం ఏమిటో తెలుసునా? ఆ స్థితిలో దైవం కానిదంటూ ఇంకేమీ కనబడదు. తానూ దైవమే, తన చుట్టూ వున్నదీ దైవమే. తన యందు, అఖిల భూతముల యందు వ్యక్తం అవుతూ ఉన్నది దైవమే అని స్పష్టంగా తెలుస్తుంది. మన యొక్క వ్యక్తిత్వం కరిగిపోయి అస్తిత్వం మాత్రం ఉంటుంది. తనను తాను వేరు గుర్తుంచుకునే జబ్బు అక్కడ ఉండదు. కరిగిపోవలసిన వ్యక్తిత్వం పెరిగిపోయింది అంటే అర్థం ఏమిటి? ఎంతగా పెరిగిపోయింది అంటే ఆ వెలుగు ప్రసరించడానికి కూడా సందు దొరకనంతగా! అంతగా అడ్డుపడి, ప్రసరించకుండా చూచుకొని, ఎందుకని ఇలా జరుగుతుంది, అంటే ఎలా! ("నీకు, నాకు మధ్యనున్న అడ్డుగోడను తొలగించు" అన్న బాబా మాటలు – "మీరు గీతలు గీస్తుంటే, నేను వాటిని చెరుపుతున్నాను" అన్న గురుదేవుల మాటలు గుర్తొస్తున్నాయి కదా!) దైవం నీ నుండి ఒకటి సంకల్పించింది. దానినలానే సాగనిస్తే బావుండేది. (కొన్ని క్షణాలు నిశ్శబ్ధంగా గడిచాయి. అతడు పశ్చాత్తాపం చెందుతున్నట్లు కనిపించాడు. గురువుగారి చూపులు కూడా అతడికి ఉపదేశిస్తున్నట్లుగానే ఉన్నాయి. వెలుగునుండి వెలువడేవన్నీ వెలుగునే వర్షిస్తాయి కదా! అందుకనే ఆ 'పెద్దల' చూపు, స్పర్శ, వారి మాట మొదలైనవన్నీ చేరువైన వారిని ఉద్ధరించడానికి వ్యక్తమవుతూ 'ఉంటాయని' అనుభవజ్ఞులు చెబుతుంటారు. అతడు ప్రస్తుతం ఆ చూపులతో తడబడుచున్నాడు. కనుకనే అహంకార స్థితి నుండి పశ్చాత్తాపం వైపుకు అతడు మళ్లుతున్నాడనిపించింది)

**అతడు :** తలపైకెత్తి గురువుగారివైపు చూస్తున్నాడాయన. క్రమంగా ఆ చూపుల్లో ఒక విధమైన ఆశ్చర్యం, గోచరించసాగింది. అలా చూస్తూనే ఇలా అన్నాడు "గురువుగారు మీ నుండి ఇంత వైభవం వ్యక్తమౌతుంది. కదా! మీ దగ్గరకు ఇంతమంది ఆకర్షితులవుతున్నారే! దేశ విదేశాలలో మీరింత కార్యక్రమాన్ని నడిపిస్తున్నారే! దీని కంతటికిగాను మీరేలాంటి సాధన చేస్తుంటారు, రహస్యమైతే చెప్పవద్దు, చెప్పవచ్చును అంటేనే చెప్పండి.

**గురువు :** చిరునవ్వుతో ఇలా అన్నారు "ఇందులో రహస్యం ఏముంది? ఈ జీవితం తెరచిన పుస్తకం.



అధ్యయనం చేసేటందుకు ఇక్కడ ప్రతి ఒక్కరికీ వీలు వుంది. ఇక సాధన అంటావా? నా దృష్టిలో ఈ జీవితమే ఒక సాధన. ఈ దేహం ఆ సాధనకు ఒక సాధనం. ప్రార్ధన, పూజ – దినచర్యను దివ్యంగా నడిపేందుకుగాను కావలసిన నేపథ్యాన్ని రూపొందిస్తాయి. (పూజ–దైవానుగ్రహాన్ని మనకు అనుకూలంగా మలచుకునే టెక్నిక్స్ అంటారు శ్రీబాబూజీ) ఆ పైన దిన్యచర్య అంతా ఒక అఖండమైన దైవ దర్శనంగా కొనసాగుతూనే వుంటుంది. విగ్రహారాధన సజీవ విగ్రహారాధనకు కావలసిన పాత్రతను మనకు అందించడానికే ఉన్నది. ఆపైన నడుస్తున్న ప్రతి సన్నివేశమూ "దైవ విలాసమే". చేరవస్తున్న ప్రతిజీవి దైవస్వరూపమే. "జగమంతా భగవన్మయం" అన్న మాటకు అర్ధమిదే. అలా మన జీవితం భగవన్మయం... ప్రేమమయం కావాలి. నేనుచేస్తున్న సాధన అదే. చేస్తున్నాను అనడం కన్నా అది నా నుండి జరుగుతూ ఉన్నది.

**అతడు** : మీరు చెప్పింది బాగుంది. మరి ఆచరణలోనికి వచ్చేసరికి మంచివాళ్లు, చెడ్డవాళ్ళు ఉంటారు. అందర్నీ దైవంగా చూడటమంటే ఎలా సాధ్యమవుతుంది?

**గురువు :** మంచి ప్రశ్న వేసావు. ఈ సాధనకు మంచి, చెడులు అడ్డురావు. దైవాన్ని దర్శిస్తూనే ఎవరికి తగినట్లుగా వారితో ప్రవర్తించాలి. దేవుడి విగ్రహాన్ని చింతపండు, బూడిద వేసి తోమడానికి మనం జంకడం లేదుకదా! ఆ తోముతున్న క్షణాలలో కూడా అది దేవుడి విగ్రహమన్న స్పృహ మననుండి జారిపోవడం లేదు కదా! అది జారి పోకుండానే విగ్రహం బాగుండాలని మరింతగా అదిమిపెట్టి మరీ తోముతున్నాం కదా! లోకంపట్ల మన ప్రవర్తన సరిగా అలాగే వుండాలి. మంచికి తగినట్లు మంచితో, చెడుకి తగినట్లు చెడుతో మనం ప్రవర్తిస్తూనే అఖండమైన దైవ దర్శనాన్ని దినచర్య నుండి అనుభవించవచ్చు. ఇలా అనుభవించడం చేతనైనకొద్దీ దినచర్యకు సృష్టి ప్రణాళికతో 'శ్రుతి' కుదురుతుంది. ఈ సృష్టి కార్యక్రమమే మన జీవిత కార్యంగా రూపొందుతుంది. ఆ రూపొందిన క్షణాలలోని దివ్యానుభూతిని రుచి చూడటానికే మనం ఈ దేహాలను స్వీకరించి దిగి వచ్చేది. (ఎందుకు ఈ జీవితంలోకి వచ్చింది అనే ప్రశ్నకు ఇలా సమాధానం లభిస్తోంది.)

**అతడు :** లోకాన్ని దైవ స్వరూపంగా చూడాలి అన్నారు. మరి మనమూ దైవస్వరూపమేనని పెద్దలు చెబుతున్నారు కదా! మరి అన్వయం ఎట్లా కుదురుతుంది?

**గురువు :** మామూలు స్థితిలో అనుకోవడానికి మాత్రమే పనికొస్తుంది నీవన్నది.

చివరకు అతడు సద్గురు చరణాలకు ప్రణమిల్లుతూ సద్గురు'పదమే'(పాదమే) తనకు సరియైన 'పథాన్ని' చూపాలని సద్గురువును వేడుకున్నాడు. (మనకు సాయిసచ్చరిత్రలోని మద్రాసు భజన సమాజం వారి లీల గుర్తుకొస్తుంది కదూ!)



# శరచ్చంద్రికలు

## ప్రేమ తత్త్వం - *జూలై 2012*

**భక్తుడు :** గురువుగారూ, ఇంతకుముందు మీరు 'అవసరం' గురించి, 'అనుగ్రహం' గురించి మాట్లాడారు. అవసరం ఉంటే అనుగ్రహాన్ని స్వీకరించడానికి కావాల్సిన సంసిద్ధత వస్తుందని, ఒక్కసారి అక్కడ అటువంటి సంసిద్ధత వచ్చాక, బాబా అన్నట్లు, మనం స్వీకరించడానికి అక్కడ బండ్ల కొద్దీ అనుగ్రహం ఉంది అని మీరు అన్నారు. వీటన్నింటినీ సమన్వయపరచేది ఏమిటి?

**గురువుగారు :** బాబా వంటి సద్గురువు సాన్నిధ్యానికి చేరుకున్నాక – ఆ మొత్తం వ్యవహారం గురించి, అది ఎలా జరుగుతుంది అనే దాని గురించి ఆయన చూసుకుంటారు. ఆ అనుగ్రహానికి తయారుగా ఉండటం ఒక్కటే మనం చెయ్యాల్సింది, అంతే. దానిని ఇది ఫలానా అని వివరించడానికి ప్రయత్నించకుండా, వేరొక దానితో పోల్చడానికి పూనుకోకుండా ఉండాలి. మీకు అటువంటి ప్రేమే గనుక ఉంటే, మిగతా విషయాలన్నింటి బాధ్యతనంతా అదే తీసుకుంటుంది.

**భక్తుడు :** ప్రతి అంశంలోనూ ప్రేమే కీలకమవుతుంది కదా?

**గురువుగారు :** అవును. ప్రేమే కీలకం. రమణమహర్షి విషయంలో – ఆయన లౌకిక ప్రపంచాన్ని వదిలిపెట్టింది వైరాగ్యభావంతోనో, 'మాయ'తో విసిగిపోవడం వల్లనో, లేదా ఆయన ఆత్మ స్వరూపుడవటం మూలానో, లేదా ఆయనకు ముక్తి కావాలనిపించడం చేతనో, లేదా వేదాంత గ్రంథాలు ఏదో చెప్పాయనో కాదు–వీటిల్లో ఏదీ ఆయన ప్రపంచాన్ని త్యజించడానికి కారణం కాదు. ఆయన ఇల్లు వదిలింది వీటికోసం కాదు. ఆయనను మధురై నుండి అరుణాచలానికి లాక్కొని వెళ్లింది – అరుణాచలేశ్వరుని పట్ల ఆయనకు గల ప్రేమే.

కాబట్టి ముందుకు లాగేది ఆ ప్రేమే. అది ఒక్కొక్కరి విషయంలో ఒక్కోరకంగా సంభవిస్తుంది. నేను చెప్పే ఈ విషయాన్నంతా భక్తి మార్గంలోకి తీసుకువస్తున్నట్లు కనిపించవచ్చు – కానీ నా ఉద్దేశ్యం అది కాదు. నిజానికి అన్నింటికీ మూలం ప్రేమే. 'ప్రేమ' దానిని భక్తి అని అనవద్దు. అది సాధన పట్లయినా లేదా సాధించే లక్ష్యం పట్లయినా ఉండే ప్రేమ. బుద్ధుని విషయంలో – జీవితం యొక్క గూఢతత్వాన్ని ఆయన నిగ్గు తేల్చాలని తపనపడ్డాడు, దానిని ఆయన ఎంతగానో ప్రేమించాడు. అదే ఆయన ప్రేమగా మారింది. అది కేవలం మేధస్సుకు సంబంధించిన అన్వేషణ మాత్రమే కాదు. మామూలుగా మేధస్సుకు సంబంధించి ప్రశ్నించడమన్నది చాలా మంది విషయంలో జరుగుతూనే వుంటుంది. వాళ్లూ ప్రశ్నిస్తారు, కానీ పుస్తకాలలో సమాధానాలు వెతుక్కుని వాటితో సమాధానపడిపోయి పడక్కుర్చీ వేదాంతులవుతారు. కానీ



బుద్ధునికి తనకుతాను ఆ పరిష్కారాన్ని కనుగొనడమనేది అత్యంత ప్రబలమైన వ్యక్తిగత అవసరంగా మారింది. అదీ ఆయన ప్రేమ. నేను దానిని 'ప్రేమ' అనే అంటాను. అటువంటి ప్రేమ అరుణాచలేశ్వరుని కోసమైనా, సాయిబాబా కోసమైనా, సత్యం కోసమైనా, సత్యాన్వేషణ కోసమైనా... ఇవన్నీ కూడా ప్రేమే.

**భక్తుడు :** మన అన్వేషణలో మనం చేసే సాధనకు కావలసింది గట్టి సంకల్పమా లేక మనో నిశ్చయమా? ఎటువంటి సాధన శ్రేష్ఠమైనది?

**గురువుగారు :** సరైన సాధన ఎప్పుడూ మన ప్రేమకు వ్యక్తీకరణగా అనుభవమవుతూ ఉంటుంది. ఆ ప్రేమ ఒక వస్తువు పట్ల కావచ్చు, విషయం పట్ల కావచ్చు. లేదా ఒక రూపం పట్ల కావచ్చు. అది ఏదైనా కానివ్వండి. అది ప్రేమ. మనం చేసేటువంటి సాధన మన ప్రేమను వ్యక్తీకరిస్తున్నపుడు అది సరైన సాధనే అవుతుంది.అంతేగాని సాధన తనకు తానుగా ఇదే సరైన సాధన అని చెప్పదు. అది అటువైపు నుండి జరగదు (అంటే అది ఆలోచించి చెప్పే విషయం కాదు) – అలా అయితే అది బండిని గుఱ్ఱానికి ముందు పెట్టినట్లుగా వుంటుంది – ముందుగా మనం పుస్తకాలన్నింటినీ చదివి, అధ్యయనం చేసి, నేర్చుకుని, ఆ తరువాత ఏది మంచి సాధనాపద్ధతి అని చూసి, ఒక పద్ధతిని ఎంచుకొని దాన్ని ఆచరణలో పెట్టుకోవడానికి, దానిని సాధన చేయడానికి, అది పనిచేసేలా చేయడానికి ప్రయత్నిస్తూ, ప్రయత్నిస్తూ వుండటం – ఇది కాదు. అది అలా జరిగేది కాదు. మనలో ప్రేమను రగిలించిన ఆ లక్ష్యాన్ని పొందడానికి మనం ఎంచుకున్న సాధనాపద్ధతి 'మార్గం' అయినప్పుడు ఆ సాధన మన ప్రేమకు నిజమైన వ్యక్తీకరణ అవుతుంది. అలా కాకపోతే అది ఫలవంతం కాదు. మనం సాధారణంగా ఇలానే చేస్తుంటాం. మన సాధన యొక్క లక్ష్యం కన్నా సాధనాపద్ధతికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాం, చివరకు మనం లక్ష్యానికన్నా సాధనాపద్ధతినే ఎక్కువగా ప్రేమించడంతో అది ముగుస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ, మరణభయాన్ని మేము ఏ విధంగా జయించగలం?

**గురువుగారు :** జీవితం యొక్క మూలసూత్రాన్ని, వాస్తవతత్వాన్ని మీరు నిజంగా అర్థం చేసుకున్నప్పుడు, బహుశా మరణమనేది అంత భయానకమైనది కాదని మీకు తెలియవచ్చు. రమణమహర్షికి అనుభవమైంది కూడా అదే. ఆ అనుభవం పొందడం ద్వారా అది ఆయనకు తెలిసింది. జీవితపు మూలసూత్రం ఆయనకు తెలుసు కనుక, మనం మరణభయం అని పిలిచేది కేవలం భ్రమ మాత్రమేనని ఆయన గ్రహించారు. మనమూ చివరకు రమణమహర్షిలాగా సాక్షాత్కారం పొందవచ్చునేమోగాని, దానిని ప్రమాణంగా ప్రాతిపదికగా తీసుకుని మనం మొదలుపెట్టకూడదు. ఎందుకంటే అది కూడా మనకు ఊహామాత్రమైనదే కాబట్టి. ముందే, "మరణమనేది ఒక మాయ, దానికి మనం భయపడకూడదు" అనే లక్ష్యాన్ని ధ్యేయంగా పెట్టుకుని మనం మొదలుపెడుతున్నాం. అది మనం అనుకునేలా మాయ కాకపోవచ్చు. మనం దానిని మాయ అని అనుకోవడం కాదు, అది మన అనుభవమై వుండాలి. అది మాయ అని తెలుసుకోవాలి. ఒకవేళ మరణమనేది ఉన్నా, అది నిజమే అనుకున్నా, దానిని ముఖాముఖి



చూద్దాం! దానిని అలా చూడటానికి నీకు శక్తినిచ్చేది ప్రేమ. నేను ఇంతవరకు మీకు చెప్పాలని ప్రయత్నిస్తున్నది ఇదే. మనం ప్రేమలో జీవిస్తున్నాం. అందువలన మరణమనేది మనకు అప్రస్తుతమైన, ఏ మాత్రం ప్రాముఖ్యత లేనటువంటి విషయం. ఆ ప్రేమ సద్గురువు పట్లయినా, అరుణాచలేశ్వరుని పట్లయినా, జ్ఞానం పట్లయినా, – అది ఎవరి పట్ల అనేది ముఖ్యం కాదు. అది ప్రేమ.

మళ్లీ ఇదే ప్రేమను మీరు వేరొక భాషలో – అవసరమని, కోరికని పిలవవచ్చు. ఇటువంటి మానవ స్థితిగతులన్నీ ప్రేమ యొక్క వివిధ ఛాయలే. మీకు దేనిపట్లయినా ప్రేమ ఉంటే మీకు దాని అవసరం ఉంటుంది. ఆ ప్రేమ మరింత అవసరాన్ని కలిగిస్తుంది. దానిని మీరు ఇంకా ఎక్కువ కోరుకుంటారు. అప్పుడు మీరు దానిని ఎక్కువగా పొందుతారు. మన ప్రతి ఒక్కరిలో అణుమాత్రంగా ప్రేమ ఉంది. దానిని వ్యక్తం చేయడానికి ప్రయత్నించండి. వ్యక్తం చేయడం వలన ప్రేమ పెరుగుతుంది. ఎన్నోరకాలైన భయాలు, కోరికలు, అలవాట్ల కారణంగా ప్రేమ మన హృదయంలో 'అణిగి' ఉంది. మీరు దానిని వ్యక్తం చేయాలి. మీ హృదయం నుండి వెలుపలకు తీసుకుని రావాలి.

హృదయానికి గల ముడులను తీయడం అంటే ఇదే – ఈ ముడులనే వేదాంతులు గ్రంథులు అంటారు. "హృదయానికి గల ముడులను తొలగించండి" అని రమణమహర్షి చెప్పింది కూడ ఇదే. "మన భావోద్వేగాలకు స్థానమైన మన హృదయంలో ప్రేమ దాగి వుంది. మన హృదయం కోరికలతో, అలవాట్లతో, ఆకర్షణలతో, వాసనలతో కట్టుబడిపోయింది. కాబట్టి దానికున్న ఆ ముడులు విప్పండి, వాటిని తొలగించడానికి ప్రయత్నించండి" అని ఆయన భావం. ఆయన వాసనలు, హృదయగ్రంథి అనే పరిభాషలో చెప్పారు. నేను చెప్పేదీ అదే, కానీ వాడే పదాలు మాత్రం భిన్నమైనవి.

**భక్తుడు** : గురువుగారూ! అనేక ఆధ్యాత్మిక వర్గాలలో అహాన్ని విడిచిపెట్టాలి, నాశనం చేయాలి, చంపాలి అనడం మేము తరచుగా వింటుంటాం. కానీ మీరు చెప్పేది భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

**గురువుగారు :** దానిని 'చంపడం', 'నాశనం చేయడం' – ఇలాంటి విపరీతమైన వ్యక్తీకరణలు అవసరమా? నాకు ఇవన్నీ చాలా క్రూరంగా అనిపిస్తాయి. దాని బదులు నేనేమంటానంటే, నువ్వు 'ప్రేమ' అనే అనుభవాన్ని పొందినపుడు, మన అహం క్రమంగా అందులో లీనమైపోతుంది, ఆ ప్రేమతో కలసిపోతుంది. అది పూర్తిగా ఆ ప్రేమలో కరిగిపోయి, కలిసిపోయి తన అస్తిత్వాన్ని, రూపాన్ని కోల్పోతుంది.

**భక్తుడు** : గురువుగారూ! మీరు ఇంతకుముందు ఒక సత్సంగంలో ఆనందం వైపుకు సాగిపోయే పరిణామం అహాన్ని ఆధారం చేసుకుని ఉంటుంది అని చెప్పారు. చివరకు మనం ఆనందాన్ని పొందినపుడు, మన అహం అనేది లేకుండా పోవాల్సిందే. మరి అలా అయినపుడు అది ఈ పరిణామానికి ఎలా సహాయపడుతుంది? ఎప్పుడు అది లేకుండా పోతుంది?

**గురువుగారు :** అహంలోనే ఆ ప్రేమ రగులుకుంటుంది. ఆ ప్రేమ పెరిగినపుడు ఆ ప్రేమాగ్నిలో



అహం దహించబడిపోతుంది. ఇక అదక్కడ ఉండదు. అహం ఆజ్యం వంటిది. ప్రేమనే అగ్నికి ఆ ఆజ్యం తోడవుతుంది. కాసేపటి తరువాత చూస్తే అక్కడ ఉండదు. అది వేరే రూపంలో ఉంటుంది – ఆ దీపాన్ని చూడండి (అక్కడున్న నూనె దీపాన్ని చూపుతూ). ఆ దీపానికి ఆధారమైనది ఏమిటి? నూనె. కానీ కాసేపటి తరువాత, ఆ నూనె ఎక్కడికి పోయింది? (ఆ నూనెలాగ) మరొకదానికి ఆధారమైనది తన స్వంత అస్తిత్వాన్ని కోల్పోవచ్చు. మన అహం, విసుగు, దుఃఖం, తపన, ప్రేమ కోసం మనకుగల అవసరం, సద్గురువుపట్ల మనకు గల ఆర్తి ఇవన్నీ నూనెలా పనిచేస్తాయి. అందుకనే ముందు మనం సాయిబాబా వంటి సద్గురువు కోసం అన్వేషిస్తాం. ఒక్కసారి ఆ ప్రేమ జ్వాల రగులుకున్నాక, ఆ జ్వాల మన అహాన్ని ఆజ్యంగా వాడుకుంటుంది. కనుక అహం అప్పుడసలు లేకుండా పోతుంది. సద్గురువు యొక్క రూపం ఆ మెత్తనైన దీపపు వత్తిలాగ పనిచేస్తుంది. **కోల్పోవడం ద్వారా పొందడమనేది ఏదైనా ఉంటే అది కేవలం ప్రేమలో మాత్రమే.** జీవితాన్ని కోల్పోవడం ద్వారా జీవితాన్ని పొందుతారని బైబిల్‌లో క్రీస్తు చెప్పింది కూడా ఇదే.

**భక్తుడు** : గురువుగారూ! మేము మారడానికి, పరివర్తన చెందడానికి కావలసిన సంసిద్ధతను పెంపొందించుకోవడం ఎలా?

**గురువుగారు :** మీకు ఆ అవసరం, కోరిక ఉండడం వలన, మీకు కావలసినదేమిటో మీరు తెలుసుకున్నప్పుడు, మీ ధ్యేయం ఏమిటనేది మీకు తెలిసినప్పుడు వచ్చే రసాత్మకతనే మనం ప్రేమ అంటాము. అదే నిన్ను వృద్ధి చేస్తుంది. అప్పుడు నువ్వు పరివర్తన చెందుతావు. ఆ ప్రేమ మనలోని అభివృద్ధికి కారణమైన పోషకంగా మారుతుంది.

**భక్తుడు** : నా లక్ష్యం – నా ప్రేమకు ఆధారమైన లక్ష్యాన్ని (సద్గురువును) నేను తెలుసుకోగలిగితే?

**గురువుగారు :** ప్రేమకు లక్ష్యం అని కాదు – నువ్వు ప్రేమించే ఆ లక్ష్యం నీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది. నీకు అవసరమైన దానినే నువ్వు ప్రేమిస్తావు. అంతే. అందుకనే, మొదట నీకు ఏమి కావాలో నువ్వు తెలుసుకోవాలి. అప్పుడు ఆ లక్ష్యాన్ని ప్రేమిస్తావు లేదా ఆ లక్ష్యానికి నిన్ను చేర్చే మార్గాన్ని ప్రేమిస్తావు – అదేదైనా గాని, అవి రెండూ ఒక్కటే. దాని ఫలితంగా కలిగే రసాత్మకానుభవమే ప్రేమ.

**గురువుగారు :** సరైన సాధన మన ప్రేమను వ్యక్తం చేసేదిగా ఉంటుంది, అలా చెయ్యకుండా ఉండడం నీవల్ల కాదు. నువ్వు దానిని చెయ్యక తప్పదు. సాధన ఏదైనా అది మన ప్రేమకుగాని, మన అవసరానికి గాని ఒక వ్యక్తీకరణ అయివుంటుంది. అది ఆ అవసరాన్ని లేదా ప్రేమను వ్యక్తం చేస్తూ ఉంటుంది. మీరు ఎలా పిలిచినా సరే, నేను దానిని 'ప్రేమ' అని పిలవడాన్ని ఇష్టపడతాను. ఎందుకంటే ప్రేమ మన అవసరం, మనలోని ఆ అవసరమే ప్రేమను పెంచుతుంది. అది ఎలా పెరిగినా సరే అది ప్రేమ. కాబట్టి సాధన కేవలం ఓ వ్యక్తీకరణ మాత్రమే. కానీ ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే మనం చేసే సాధన వలన ఫలితం రాదు. ఆ ఫలితం మనం చేసే సాధన మీద



ఆధారపడి ఉండదు. అయినప్పటికి మనం వ్యక్తం (సాధన) చేయవలసి ఉంటుంది. ఆ వ్యక్తీకరణ మన ప్రేమను తెలియచేస్తుంది. మన ప్రేమను, మన అవసరాన్ని పెంచుతుంది. కాబట్టి నిజానికి రెండూ అవసరమే. అర్ధమవుతోందా? నా ఉద్దేశ్యాన్ని స్పష్టంగా చెబుతున్నాను కదా?

మన సాధన – మనం సాధన అని అనుకునేది – కేవలం మన ప్రేమకు, మన అవసరానికి వ్యక్తీకరణ మాత్రమే. వ్యక్తం చేయకుండా ఉండటం మన వల్ల కాదు. మనం దానిని వ్యక్తం చేయాల్సిందే. ఇలా మన అవసరాన్ని వ్యక్తం చేస్తూ ఉండడం వలన, ప్రేమ ఇంకా ఎక్కువవుతుంది, ఇంకా ధృఢమవుతుంది. మనలో ప్రేమ, ఆర్తి పెరిగేకొద్దీ మనం లక్ష్యాన్ని చేరుకోవడానికి గల అవకాశాలు పెరుగుతాయి. ఇలా పరోక్షంగా, మన సాధన మనం పొందే ఫలితంతో సంబంధాన్ని కలిగివుంటుంది. కానీ ప్రత్యక్షంగా మాత్రం మనకు ఫలితాన్నిచ్చేది మనం చేసే సాధన కాదు, అది అనుగ్రహం మాత్రమే. అనుగ్రహం నీ సాధన మీద ఆధారపడి లేదు. అది మీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడర్ధమయిందా?

**భక్తుడు :** ప్రేమమార్గంలో నూటికి నూరుశాతం ప్రేమ ఉంటేనే అది సాధ్యపడుతుంది అనిపిస్తోంది.

**గురువుగారు :** అది నూరుశాతం కాకపోయినా పదిశాతం ఉన్నా మంచిదే. ఎందుకంటే అది ప్రేమ. నీకు బాగా ఆకలిగా ఉన్నప్పుడు కడుపునిండా భోజనం దొరకలేదని ఓ ప్లేటు ఇడ్లీలను వద్దంటావా? “నాకు బాగా ఆకలిగా ఉంది, కడుపునిండా భోజనం పెట్టండి లేకపోతే అసలు భోజనమే వద్దు” అని అంటావా? లేదు కదా! ఒక్క ఇడ్లీ పెట్టినా తీసుకుంటావు. ఇక్కడ కూడా జరిగేదదే. నువ్వు ప్రేమిస్తున్నావు, ప్రేమ క్రమంగా పెరుగుతోంది, అంతేగానీ ఎప్పుడో స్నాతకోత్సవం పెట్టి (ప్రేమ సరిపోయిందని) నీకేమీ పట్టా ప్రధానం చేయరు. అది అలా ఉండదు. ప్రేమ పెరిగే కొద్దీ సంతోషమూ పెరుగుతుంది. దానితోపాటు ఆనందమూ పెరుగుతుంది.

ముందు రెండు ఇడ్లీలు సరిపోతాయి అనిపిస్తుంది. కానీ ఆ రెండూ తిన్న తరువాత “లేదు, ఇవి సరిపోవు” అని తెలుస్తుంది. అప్పుడు మళ్లీ మనం ఆహారం కోసం ప్రయత్నిస్తాము. ఇంక ఇంతకన్నా అవసరం లేదు అని మనకనిపించినా, మనకు పూర్తిగా సంతృప్తి కలిగేదాకా మనం ప్రయత్నిస్తూ ఉంటాం. దానిని పొందిన తరువాత దాని గురించి చెప్పడానికి ప్రత్యేకమైన పదం లేదు. ఆ స్థితిని నిర్ధిష్టంగా ఇది అని చెప్పలేము. అందుకని ఇక్కడ ఈ విషయంలో ప్రారంభం నుండి గమ్యం వరకు, మొత్తం మార్గమంతా ఆనందంగా ప్రేమమయంగా ఉంటుంది. అక్కడ ప్రేమ ఉంటుంది కాబట్టి ఆనందం కూడా ఉంటుంది. అంతేగాని తరువాత ఎప్పుడో ఆనందం వస్తుందని దానికోసం ఇప్పుడు మనం బాధలుపడాలి అని కాదు. మనం ప్రేమతో మొదలుపెడతాం, ప్రేమైక పథంలో పురోగమిస్తాం, ఆ ప్రేమలోనే గమ్యాన్ని చేరుకుంటాం. అప్పుడు మనం సరైన పథంలో ఉన్నట్లు లెక్క. ఈ మార్గంలో సాధారణంగా అందరూ అనుభవించే ఆవేదన మామూలుగా అనుకునే వేదన కాదు – అది శారీరకమైన బాధ లేక చిత్రహింస వంటిది కాదు – అది ప్రేమ కోసం మనిషి పడే తపన. ఈ తపన ఒక రకమైన



వ్యథగా అనుభవమవుతూ, వ్యక్తమవుతూ ఉంటుంది. కానీ నిజమైన (భౌతికమైన) వేదన కాదు; అది చాలా మధురంగా ఉంటుంది. అది ఉద్వేగ భరితంగా ఉంటుంది – అది మనం కావాలనుకున్నది. కాబట్టి ఈ తపన కూడా దానికదే ఒకరకమైన ఆనందాన్నిస్తుంది.

**గురువుగారు :** ప్రేమను ఎలా వికసింపచేసుకోవాలి, ఎలా పరిపుష్టం చేసుకోవాలి, ఎలా సంవృద్ధం చేసుకోవాలి, ఎలా పెరిగేలా చేసుకోవాలి – అని ఆమె అడుగుతుంది. ప్రేమ పెరిగేలా చేయడానికి పద్ధతిగాని, ఒక ప్రక్రియగాని ఏమీ లేదు. ఒక్క విషయం మాత్రం చెప్పుకోవచ్చు. నీలో ప్రేమ వుందని, నీకు ఆ ప్రేమ యొక్క అవసరముందని తెలుసుకున్నపుడు ఇంకా నువ్వు దానిని అనుభూతం చేసుకోవాలనుకున్నప్పుడు ఆ ప్రేము అత్యధికంగా పరిపుష్టం చేసేటటువంటి వాతావరణంలో నిన్ను ఉంచుకోవడానికి ప్రయత్నించాలి లేదా అటువంటి వాతావరణాన్ని నువ్వు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడు ప్రేమ దానికదే పెరుగుతుంది. అనుకూలమైన వాతావరణాన్ని కల్పించినపుడు మొక్క పెరుగుతుంది. అంతే. మొక్క పెరగడానికి నువ్వు ఏమి చేస్తావు? నువ్వు చేసేదేమీ ఉండదు. నీరు, ఎరువు, తగిన పరిస్థితులు కల్పించడం ఇలా నువ్వు దానికి ఆలంబన మాత్రమే ఇస్తావు. నువ్వు ఇవ్వాల్సింది అంతవరకే. అది సరిపోయింది. అంతేగాని నువ్వు ఆ చిన్న మొక్కని చేతిలోకి తీసుకొని దానిని నిటారుగా చేసినంత మాత్రాన అది పెరుగుతుందా? (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు :** తగిన వాతావరణం అంటే ఏమిటి?

**గురువుగారు :** ఎక్కడైతే నీ ప్రేమకు అడ్డంకులు లేకుండా ఉంటాయో అది. అక్కడ ప్రేమను పొందడానికి, ఆ ప్రేమను అనుభూతి చెందడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఎక్కడైతే ఆ ప్రేమ రకరకాల వారికి రకరకాల రూపాల్లో అనుభవమవుతూ వారితో పంచుకోబడుతూ ఉంటుందో అటువంటి వాతావరణం. అక్కడ నీకు సరైన వాతావరణం ఉన్నట్లు లెక్క. నువ్వు అటువంటి వాతావరణంలోనన్నా ఉండాలి లేదా నువ్వు అటువంటి వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోగలిగన్నా ఉండాలి – నేను రెండూ చెప్పాను. ఒకవేళ అటువంటి వాతావరణం లేకపోతే నువ్వే దానిని సృష్టించుకోవాలి. ఎప్పుడూ అటువంటి వాతావరణంలో ఉండటం మీదే ఆధారపడటం సరైనది కాదు. అటువంటి వాతావరణాన్ని సృష్టించుకునే సామర్థ్యమూ కలిగి ఉండాలి.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో వరి బాగా పండుతుంది. ఇక్కడ హిమాలయాలలో ఈ కొండవాలుల్లో వాళ్లు ఎలా చేశారో చూడండి (వ్యవసాయ యోగ్యం కాని ఎగుడుదిగుడు కొండ భూముల్లో వరి సాగుచేస్తున్న వారి పద్ధతులను గురువుగారు ఉదహరిస్తున్నారు) అక్కడ వాళ్లు వరిసాగుకు తగిన పరిస్థితులు కల్పించారు. ఆ కొండరాళ్లతో గట్టులా కట్టి, కాలువలు తీసారు. ఆ ప్రక్కనే నీటిని నిలువచేసుకునే ఏర్పాట్లు చేసారు. చూడండి వాళ్లు వరి పండటానికి కావలసిన వాతావరణాన్ని కల్పించారు. అది వరిని సాగు చేయడానికి అనువైన ప్రదేశం కాదు. కానీ వాళ్లు దానిని అనువుగా

చేసి వరిని సాగు చేస్తున్నారు. మనము  చెయ్యవలసింది కూడా అదే.

**భక్తుడు** : మేము దానిని చేయడం ఎలా?

**గురువుగారు :** సత్సంగంతో వుండటం, సత్సంగాన్ని ఏర్పాటు చేసుకోవడం, అదే రకమైన ఆలోచనా దృక్పథం ఉన్నవారితో కలసివుండటం, వారితో ప్రేమను పంచుకోవడం, ఇలా మీ ప్రేమను పంచుకోండి.

**గురువుగారు :** పరిపూర్ణానందం వంటి వాటికి 'ఇది ఫలానా' అని మీరు పేరు పెట్టాలనుకుంటే అది సాధ్యం కాదు. అది అనుభవంగా పొందేటటువంటిది – దానిని మీరు అనుభవంగా పొందాల్సిందే. మీరు నిజమైన ఆనందాన్ని పొందినపుడు, మీరు అది ఇంకా పెరగాలనుకుంటారు. పరిపూర్ణత్వం గురించి మీకున్న ఊహ ఏదైనా సరే.... అలా సంపూర్ణంగా ఆ ఆనందాన్ని నిలుపుకోగలిగిన సామర్థ్యం మనకు కలిగే వరకు, మీరు దానిని ఇంకా ఇంకా, మరింతగా మరింతగా పొందాలనుకుంటారు.

**భక్తుడు** : 'సామర్థ్యం' అంటే మీ ఉద్దేశ్యమేమిటి?

**గురువుగారు :** ప్రేమించగలిగే సామర్థ్యం, ప్రేమను స్వీకరించగలిగే సామర్థ్యం; మీ ప్రేమను అంటిపెట్టుకోగలిగే, మీ ప్రేమను నిలుపుకోగలిగే సామర్థ్యం; ఇతర విషయాల ప్రభావాల వలన విచలితం కాకుండా ఆ ప్రేమలో స్థిరంగా ఉండగలగడం; ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఆ ప్రేమ చెక్కు చెదరకుండా ఉంచుకోగల సామర్థ్యం, ఆ పటుత్వం. ఇవన్నీ సామర్థ్యాలే. మీ కంప్యూటర్ పనిచేయడం మానివేసిందను కుందాం. మీ హార్డ్‌డిస్క్ ఖాళీగా ఉన్నట్లు కనిపిస్తుంది. మీకెలా వుంటుంది? గంటల తరబడి సమయం వెచ్చించి, వివిధ రకాలైన అప్లికేషన్స్ (Disk Warrior, Norton, Techtool, Reparing permissions) వాడి, దానిని, దీనిని కలిపి – కనిపించకుండా పోయిన ఆ సమాచారాన్ని రాబట్టడానికి వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటారు. అది మీకంతగా అవసరమైనది కాకపోతే మీరు ప్రయత్నించడం మానేస్తారు. కానీ మీ ప్రేమ పట్టుదలను ఇస్తుంది – రకరకాలుగా ఆలోచించడం, ఆ ఆందోళన, ఆ వేదన, ఆ తపన, అది తిరిగి పనిచేయడం మొదలయ్యాక, మీ సమాచారం తిరిగి పొందాక కలిగే ఆనందం, ఎంత సంతోషం...!

**భక్తుడు** : ప్రతి ఒక్కరికీ ఆ సామర్థ్యం ఉంటుందా?

**గురువుగారు :** అవును! ప్రతి ఒక్కరికి ఆ సామర్థ్యముంటుంది. సామర్థ్యమైతే ఉంది కానీ అంత ప్రేమ లేదు. ప్రేమ ఉంటే అదే ఆ సామర్థ్యానిస్తుంది. ప్రతి ఒక్కరికీ ఆ శక్తిని, సామర్థ్యాన్ని ఇచ్చేది ప్రేమే. ప్రతి ఒక్కరికీ ఆ సామర్థ్యముంది.

***ఇహమునందు గురున కీ దేహమిచ్చిన... పరము జూపి గురుతు బట్టి యిచ్చు***
***స్థిరముగాను బుద్ధి చెడనీక చూడరా... విశ్వదాభిరామ వినురవేమ...***

*జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా స్థిరబుద్ధితో గురుశుశ్రూష*
*చేసిన శిష్యుడికి ఆ గురువే ఆత్మానుభూతిని కలుగచేస్తాడు.*



## లక్ష్యసిద్ధిని లభింపచేసే ముచ్చటైన మూడు సూత్రాలు - *ఆగష్టు 2012*

**గురువుగారు :** ఇటీవల కొంతమంది వచ్చి, "గురువుగారూ! మాకో సమస్య ఉంది. మమ్మల్ని ఎవరైనా 'గురువుగారిది ఏ రకమైన మార్గం? వారిది భక్తిమార్గమా" అని అడిగినపుడు మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. ఎందుకనంటే నేను భక్తి అనే పదం వాడను. ఇది జ్ఞానమార్గమా అంటే నేను జ్ఞానమనే పదాన్ని వాడను. ఇది కర్మయోగం అందామా అంటే నేను కర్మ అనే పదమూ వాడను. ఆ మాటకొస్తే నేనసలు యోగినే కాదు (గురువుగారు నవ్వుతూ..) అందువల్ల వాళ్ళు, "అసలు మేమనుసరిస్తున్న మార్గమేమిటని అందరూ అడుగుతున్నారు, మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. నేను, "గురువుగారిది స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం" అని చెప్పండి అన్నాను. ఇది ఒక మార్గం కాకపోయినప్పటికి సరదాకు అలా చెప్పమన్నాను. కారణమేమిటంటే అన్నింటికంటేముఖ్యమైనది - **స్పష్టత**. ప్రతి విషయంలోనూ స్పష్టత ఉండాలి. మనం అనుకునే ఆ నిర్వాణమో, ముక్తో, మోక్షమో లేదా బాబా సాక్షాత్కారమో - అదేదైనా గాని, - ఒకవేళ మనకు అది వస్తే కూడా దాని పట్ల నిస్సంశయంగా ఉండటానికి స్పష్టత అవసరం. ఉదాహరణకు, కొంతమంది నా దగ్గరకు వచ్చి, "గురువుగారూ! నన్ను నేను తెలుసుకున్నాను అనుకుంటున్నాను! నేను ఆత్మసాక్షాత్కారం పొందడం నిజమేనా? (గురువుగారు నవ్వుతూ) గురువుగారూ, నాకు ముక్తి అనుభవమైంది. నిజంగా నేను ముక్తుణ్ణా?" .. ఇలా అడుగుతుంటారు. వాళ్లకు దానిపట్ల కూడా సందేహముంది. అంటే వాళ్లకు స్పష్టత లేదన్నమాట. నిజానికి మనకసలు ఏ విషయంలోనూ స్పష్టత ఉండదు. కాబట్టి మనకు ముందుగా కావలసింది స్పష్టత. దాని వలన కలిగే ఆనందం. మన ఆనందానికి గనుక స్పష్టత లేకపోతే, నిజంగా దానిని మనం ఆనందమని కూడా అనుభూతి చెందలేం. స్పష్టత, ఆనందం అనేవి కలసిఉంటాయి. అందుకే ఈ మార్గం స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం. దీనికి మీరు ఇంకా ఏమైనా పేర్లు కలిపి పెట్టుకున్నా ఇబ్బందేం లేదు, అవేమంత ముఖ్యం కాదు.

**భక్తుడు :** గురువుగారూ, ఈ స్పష్టత అనేది మనకు మనం సాధించుకునేదా? లేకపోతే మనకు ఎవరైనా ఇస్తే వచ్చేదా?

**గురువుగారు :** మీకు నిజంగా అవసరం ఉంటే, ఆ స్పష్టత వస్తుంది. ఆ స్పష్టతను పొందుతారు. మీరు ఆ స్పష్టతను సాధించుకుంటారు. నేను దానిని సాధించమనే చెప్తున్నాను. స్పష్టత ఎవరో ఇస్తారని నేను చెప్పడం లేదు, మీరు దానిని సంపాదించుకోవాలని చెప్తున్నాను. "ఊరికే అలా కూర్చోండి మీకు స్పష్టత వస్తుంది. నేను మీకా స్పష్టతనిస్తాను" అని నేను చెప్పను. అది మీకలా అనుభవం కావచ్చేమో కాని, అదేం ముఖ్యమైన విషయం కాదు. నేను చెప్పేది మాత్రం - మీ స్పష్టత మీరే సాధించాలి, సాధించండి!

**సద్గురు వచనం - శిరోధార్యం.**



**గురువుగారు :** చాలా మంది దేనినీ సరైన రీతిలో పూర్తిగా చేయలేరు. అలాంటి వారికి నేను, “నాకు ఇది నిజంగా ఎంతవరకు అవసరం? నిజంగా అవసరమా?” అనే స్పష్టత తెచ్చుకోమని చెబుతాను. ఆ స్పష్టత వచ్చాక, అంటే ఉదాహరణకు వాళ్లు, “నా తొలి ప్రాధాన్యత ప్రాపంచిక బాధ్యతలు, నా కుటుంబ బాధ్యతలు చూసుకోవడం–ఇది ఎనభైశాతం. మిగతా ఇరవైశాతం అవసరం ఆధ్యాత్మికపరమైనది. ఇది తప్పకుండా ఉందికానీ, కుటుంబపరమైన, వృత్తిపరమైన మిగతా అవసరాలు ఎక్కువగా ఉన్నాయి” అని చెప్పారనుకోండి. మీకు అటువంటి స్పష్టత ఉన్నప్పుడు, మీరు ఆధ్యాత్మిక విషయాలలో ఆ ఇరవై శాతాన్ని వినియోగించుకొని ఆనందానుభూతి పొందుతారు. ఈ ఇరవైశాతంతో పాటు ఇంకా మిగిలిన ఎనభై శాతాన్ని కూడా ఆనందంగా ఆస్వాదించగలరు. ఆ స్పష్టత గనుక మీకు లేనట్లయితే సంఘర్షణలో ఉంటూ, ఆ ఊగిసలాటలో జీవిస్తూ – ఇటు ప్రాపంచికంగానూ సరిగా ఉండలేరు, అటు పారమార్ధికంగాను సరిగ్గా ఉండలేరు. అందుకనే నేను, మొదట మిమ్మల్ని స్పష్టత తెచ్చుకోమంటాను. మీరు ఇక్కడ ఎందుకోసం ఉన్నారు? “మేము ఆధ్యాత్మిక సాధకులం, మా జీవితాలన్నీ పూర్తిగా ముక్తికి,మోక్షానికి అంకితం. కానీ ఇతర అవసరాలు మమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాయి” అని చెప్పి మిమ్మల్ని మీరు వంచించుకోవద్దు. ఇలా చెప్పుకోవద్దు. నిజంగా ముక్తికోసం కలత చెందేవారికి ఈ “ఇతర అవసరాలు ఉండవు. వారు రమణమహర్షిలా ఉంటారు. కానీ మనకు ఆయనకున్న స్వచ్ఛమైన స్వభావం, ఆయనంత స్థాయి లేవు. చాలా వ్యామోహాలు మనల్ని లాగుతున్నాయి. మనకు స్పష్టత, అవగాహన లేకపోవడం వలన మనం చాలా వైపులకు అలా లాగబడుతూ పెనుగులాటలో ఉంటాం. మన అవసరాలు మనల్ని అనేకరకాలుగా కొన్ని ఇటువైపు, కొన్ని అటువైపు లాగుతున్నందువల్ల ఈ అవసరాలు తీర్చుకోవడంలో మనకు వైరుధ్యం, సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ మీరు స్పష్టత తెచ్చుకొని, ఆ అవసరాలను క్రమపద్ధతిలో పెట్టుకొని సామరస్యాన్ని సాధించగలిగితే అవి ఒకదానితో ఒకటి ఘర్షణ పడకుండా, పోటీ పడకుండా ఉంటాయి. అలా అయినపుడు మీరు కనీసం మీ అవసరాలనైనా సామరస్యంతో అనుభవించగలుగుతారు.

మన మనసులో ప్రతి విషయం యొక్క స్థానం ఏమిటనే స్పష్టత వచ్చాక, మన జీవితంలో ప్రతి అణువునూ ఎటువంటి సంఘర్షణ, వైరుధ్యం లేకుండా మనం పరిపూర్ణంగా అనుభవించగలం.నేను, ఈ సంఘర్షణ నుండి మిమ్మల్ని మీరు విముక్తి చేసుకోండి అంటున్నాను. అయస్కాంతం, ఇనుపముక్క ఉదాహరణలో గల మూలసూత్రం వంటిదే ఇది – దీనిని మీకు అన్వయించుకోండి. ఇనుపముక్కకు, అయస్కాంతానికి గల తేడా ఏమిటి? రెండింటిలోను అణువుల సంఖ్య సరిసమానంగా ఉంటుంది. వాటిని వేరుచేసేదేమిటంటే – అయస్కాంత క్షేత్రంలో వున్న ప్రతి అణువు క్రమబద్ధంగా, ధృవీకృతమై, మిగతా అణువులతో సామరస్యాన్ని కలిగి ఉంటుంది. దాని అస్తవ్యస్తత నశిస్తుంది. అది అయస్కాంతంగా మారుతుంది. ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చడానికి సులభమైన మార్గం దానిని మళ్లీ మళ్లీ అయస్కాంతంతో రుద్దడం, దానిని అయస్కాంత స్పర్శలో ఉంచడమే. క్రమంగా అయస్కాంత సాంగత్యం



వల్ల ఇనుప అణువులు తమ అస్తవ్యస్తతను కోల్పోయి క్రమతను పొంది ధృవీకృత మవుతాయి. నెమ్మదిగా, అవి ఒకదానితో ఒకటి ఒద్దికను పొంది సమగ్రతను సాధించి వాటికవే అయస్కాంతంగా మారుతాయి. మన విషయంలో మనమంతా ఇనుపముక్కలం, బాబా మన అయస్కాంతం. బాబాను గుర్తుపెట్టుకోవడం, మన మనస్సును తిరిగి తిరిగి బాబా మీద లగ్నం చేయడం, మనల్ని మనం ఎంత వీలైతే అంత బాబా సన్నిధిలో ఉంచుకోవడం, శిరిడీకి వెళ్లడం ద్వారా భౌతికంగా కూడా ఆయన సన్నిధిలో ఉండడం, ఇవన్నీ తిరిగి తిరిగి అయస్కాంతంతో రుద్దడం వంటివే. తద్వారా మనం సామరస్యాన్ని సాధిస్తాం.

**గురువుగారు :** నేను మిమ్మల్ని ఫలానా పనిచెయ్యమని అడగడంలేదు. మీరు వచ్చి మేము ప్రేమించేటటువంటి లక్ష్యం (సద్గురువు) 'ఫలానా' అని అన్నప్పుడు మీ ఆనందం అందులోనే ఉందని చెప్పినపుడు, మీరు దానిని పొందేదాకా దాని మీదనే లగ్నం చేయండి అంటాను. "నా ఆనందం ఇందులో ఉంది" అని మీరు అంటున్నారు కానీ దానికోసం ఏమీ చేయడం లేదు. దానిమీద దృష్టి పెట్టండి! మీరు, "నేను పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాను. ఇది నాకు చాలా అవసరం, నాకు ఈ డిగ్రీ కావాలి" అంటారు. వచ్చి ఇలాగే అడుగుతుంటారు. నేను చెప్పగలిగింది ఏముంటుంది? "మంచిది, మీకు నిజంగా అంతగా పాస్ కావాలనుకుంటే కష్టపడి చదవండి!" అంటాను. నేను మిమ్మల్ని పరీక్షలో పాస్ కమ్మని చెప్పడం లేదు, ఆ డిగ్రీ తెచ్చుకోమని చెప్పడంలేదు, అలాంటిదేం లేదు. కానీ మీరు నా దగ్గరకు వచ్చి, "నాకు ఈ డిగ్రీ కావాలి, నేను ఈ పరీక్షలో పాస్ కావాలి"! అని చెప్పినపుడు, నేను 'ఇదిగో ఇలా చెయ్యండి' అని చెప్తాను. మీరు ఈ పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాము అని చెప్తూ, రోజూ సినిమాలకు పోతూ, స్నేహితులతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ, సముద్రపు ఒడ్డున తారట్లాడుతూ ఉంటే, అపుడు నేను "ఇది పద్ధతి కాదు, మీ రూములో కూర్చుని కష్టపడి చదవండి" అంటాను. ఇదీ నేను చెప్పేది.

మీరు గనుక, "లేదు, లేదు, నేను ఇంత కష్టపడి చదవాల్సివస్తే నేను ఈ పరీక్షలో పాస్ కావాలనుకోవడం లేదు, ఇదంతా అవసరం లేదు" అన్నారనుకోండి. అపుడు మీకు కనీసం ఆ స్పష్టతయినా ఉంటుంది! అలా కాకుండా మీరేమో నా దగ్గరకొచ్చి, "గురువుగారూ! మేము అంతదూరం నుండి మీ కోసం వచ్చాము, మీ సాన్నిధ్యాన్ని పూర్తిగా అనుభూతి చెందాలనుకుంటున్నాం గురువుగారూ!" అని చెబుతున్నారు. ఇలా చెప్పినపుడు "అలా అయితే సరైన పద్ధతిలో చెయ్యండి" అని మాత్రమే నేను చెప్పగలను. నేను చెబుతున్నదీ అదే. (గురువుగారు గుసగుసలను అభినయిస్తూ..) "రండి, నా సాన్నిధ్యాన్ని అనుభవించండి!" అని నేను మిమ్మల్ని ఇక్కడకు రమ్మని పిలువలేదు. నేను ఎన్నడూ అలా చేయలేదు. ఇక్కడకు వచ్చి "మేమిక్కడ ఎంతో సంతోషంగా ఉన్నాం, మాకు ఇక్కడ సంతృప్తిగా ఉంది. మేము మీ కోసం వచ్చాం" అని చెప్పింది మీరు. **నిజంగా మీరు నా కోసం వచ్చుంటే దానిని చేతల్లో చూపించండి. ఆమూలాగ్రమూ అలా చేయండి.** అలా కాకపోతే, ఎందుకు ఇక్కడ మీ సమయం వృధా చేసుకోవడం?



వెళ్లి మీకు మరింత లాభమొచ్చేటటువంటి, ఉపయోగకరమైన ఇతర విషయాలను సాధించుకోండి. నా ఉద్దేశ్యమిది. మీకు ఒక **లక్ష్యాన్ని నేనెన్నటికీ నిర్దేశించను. మీ లక్ష్యాన్ని సాధించడానికి నేను సహాయం మాత్రమే చేస్తాను.** మీ లక్ష్యం మీరే నిర్ణయించుకోవాలి. అలా నిర్ణయించుకున్న తరువాత, ఇతర బంతులు వచ్చి మీ లక్ష్యాన్ని తాకకుండా మంచి గోల్‌కీపర్‌లాగా దానిని కాపాడుకోవాలి.

**గురువుగారు :** నేను ఈ విషయాన్ని ఎన్నోసార్లు చాలా చాలా స్పష్టంగా చెప్పాను. "ఇది చాలా మంచి లక్ష్యం, దాని తరువాత రెండవస్థానం ఆ లక్ష్యానిది" అని మీ లక్ష్యాల విషయంలో నేనెప్పుడూ సలహాలివ్వను. మీ లక్ష్యం యొక్క ఎంపిక మీదే. మీ లక్ష్యాన్ని మీరే ఎంచుకోవాలి. **ఎలా ఎంచుకోవాలి? ఇది నేను చెప్తాను.** ఏదైతే మీకు అత్యంత సంతోషాన్ని కలిగిస్తుందో, మీ హృదయంలో ఎక్కువ ప్రేమను కలిగిస్తుందో అటువంటి దానిని ఎంపిక చేసుకోండి. అది ఏదైనా ఫరవాలేదు. అది సామాజిక సేవయినా, పర్యావరణ సంరక్షణయినా మరేదైనా సరే వెళ్లి ఆ పని చేయండి. మీకది ఆనందాన్నిస్తూ ఉంటే వెళ్లండి. అది మీ లక్ష్యమైతే నేను దానికి వ్యతిరేకిని కాదు. అంకితభావంతో, సంతోషంతో ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనేవారిని నేను గౌరవిస్తాను. వారు దారి తప్పారనో, ఆధ్యాత్మిక పంథాలో లేరనో నేను అనను. వారిపట్ల నాకు అంతే సమంగా గౌరవభావముంది. అయితే మీ లక్ష్యాన్ని మీరే ఎన్నుకోవాలి. వాళ్ళ వాళ్ల లక్ష్యం పట్ల ఎంత అంకితభావంతో, తదేకతతో ఉన్నారో మీరూ మీ లక్ష్యం పట్ల – అది బాబాను ప్రేమించడమైనా, మరొకటైనా – అంతే తదేకతతో ఉండాలి. అందరికీ నేనిచ్చే సలహా ఏమిటంటే, **మీ హృదయంలో ప్రేమను కలిగిస్తూ, మిమ్మల్ని ఆనందభరితుల్ని చేసేటటువంటి దానిని ఎన్నుకోండి, దానికి కట్టుబడి ఉండండి, దానిపైన ఇంకా ఇంకా దృష్టి పెట్టండి.**

**భక్తుడు** : కానీ గురువుగారూ, మా లక్ష్యంపట్ల దృష్టిని (ఫోకస్) నిలుపుకోవడం ఎలా? క్షణమాత్రంలో దానిని కోల్పోవచ్చనిపిస్తుంది.

**గురువుగారు :** దృష్టిని నిలుపుకోవాల్సిన అవసరం లేదు. లక్ష్యం ప్రేమ నుండి వచ్చినదైతే, దృష్టిని నిలుపుకోవడానికి నిర్వహణా బాధ్యతలు నిర్వర్తించాల్సిన అవసరముండదు (గురువుగారు నవ్వుతూ) మీకు గనుక ప్రేమ వుంటే, మీరు దృష్టి పెట్టే లక్ష్యాన్నుంచి మీరు ప్రక్కకు మళ్లలేరు, మీవల్లకాదు. అదీ లగ్నం చేయడమంటే. మీరు ఒకరిని ప్రేమించారంటే, ఆ వ్యక్తి గురించి ఆలోచించకుండా ఉండటమనేది చేయలేరు. మీ ఆలోచనలు ఎప్పుడూ తిరిగి తిరిగి ఆమె మీదకో, లేదా అతని మీదకో పోతూనే ఉంటాయి. కానీ కొన్నిసార్లు పాత అలవాట్లు లేదా పాత సాంగత్యాల వల్ల, మనం ప్రేమిస్తున్నప్పటికీ కొన్ని విచారకరమైన ఆలోచనలు వస్తుంటాయి. మనం వాటిని దూరం చేసుకోవాలనుకున్నప్పటికి మన వల్ల కాదని తెలుస్తుంది. లేకపోతే కొన్ని అడ్డంకులు వస్తాయి. మనం ఎదుర్కోక తప్పని అడ్డంకులెదురవుతాయి. ఇటువంటి సందర్భాలలో మన దృష్టిని నిలుపుకోవడానికి ఇతర విషయాలు – సత్సంగం, మంచి సాంగత్యం, మనం ఇక్కడ ఎందుకున్నాం, మన లక్ష్యమేమిటి అని ఆలోచించడం



– ఇటువంటి మంచి విషయాలు సహాయం చేస్తాయి. మీరందరికీ ఇలాగ దృష్టిని నిలుపుకోవడానికి అవసరమైన సూత్రాలు బాగా తెలుసు. మీకు నచ్చినదానిని ఉపయోగపెట్టుకోండి.

**భక్తుడు** : గురువుగారూ,మా సంతోషానికి, దుఃఖానికి మేమే బాధ్యులమని అంగీకరించగలిగితే మేము ఆనందంగా ఉంటామని చెబుతున్నారా?

**గురువుగారు :** మీరు ఆనందంగా ఉన్నా లేకపోయినా, మీరు ఏ దుఃఖమైతే బయటినుండి వస్తుంది అనుకుంటున్నారో కనీసం అదన్నా ఆగిపోతుంది.

**భక్తుడు** : ఆ బాధ్యత మాదేనని అంగీకరించడం వల్లనా?

**గురువుగారు : మీ ఆనందానికిగాని, దుఃఖానికి గాని ఇతరులు బాధ్యులు కారని తెలుసుకోవడం ద్వారా, ముందు మీరు వాళ్లకు విముక్తి కల్పిస్తారు, తరువాత వాళ్ల నుండి మిమ్మల్ని మీరు విముక్తుల్ని చేసుకుంటారు, కొంతలో కొంతైనా ఓ విధమైన స్వాతంత్ర్యం , విముక్తి పొందుతారు.**

**భక్తుడు** : గురువుగారూ, ఆ విధంగా మమ్మల్ని మేము చూసుకోవడం ఎలా? మేమే (ఆనందానికి, దుఃఖానికి) బాధ్యులమని నిజంగా తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు :** ముందుగా ఇతరుల్ని నిందించడం ఆపండి. స్పష్టంగా ఉండండి! అపుడు అది సులభమవుతుది. మనల్ని మనం భ్రమలో పెట్టుకొని దానిని ఒక సమస్య చేసుకుంటాం. తర్వాత అది ఒక అలవాటుగా, ఆలోచనాసరళిగా మారుతుంది. అందుకనే నేను చెప్పేది: ముందు మీరు దానిని ఆపితే – ప్రపంచంలో మీరు నిందించడానికి ఇక ఎవ్వరూ లేకపోతే – మీకు నిందించుకోవడానికి మీరు, లేదంటే బాబా తప్ప ఇక ఎవ్వరూ లేరనే కనీస స్పష్టతన్నా వస్తుంది.

ఇపుడు నేను చెప్పేదానిని ప్రతి ఒక్కరూ తమ స్వంత సమస్యలను ఆధారం చేసుకొని, వారి వారి అవగాహనను, దృక్పథాన్ని అనుసరించి, తమతమ రీతుల్లో అర్థం చేసుకుంటారు. కానీ అందరికీ వర్తించే(సార్వత్రికమైన) విషయానికొస్తే – అందులో మూడు అంశాలు ఉన్నాయి. వీటిని ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఇప్పటి వరకు జరిగిన అన్ని సత్సంగాలు, నేను గంటల తరబడి మాట్లాడిన మాటలు – వీటన్నింటికీ ముఖ్యమైనవి మూడు అంశాలు.

**మొట్టమొదట** మీకొక లక్ష్యం, ఒక ధ్యేయం వుండాలి.మీకు ఏం కావాలో, మీరు దేని కోసం తాపత్రయపడుతున్నారో మీకు తెలియాలి. ఒకవేళ మీకు ధ్యేయమంటూ ఒకటి వుంటే ఆ ధ్యేయాన్ని గుర్తుపెట్టుకోండి. మీరు తిరువణ్ణామలైకిగాని, శిరిడీకిగాని వస్తున్నపుడు మీకొక ధ్యేయమో లేదా లక్ష్యమో ఉందని భావిస్తారు. కనీసం ఏదో ఒకటి ఉందనైనా అనుకుంటారు. అది ఏదైనా సరే, అసలు మీరు దానిని గుర్తుంచుకుంటున్నారా? మనం ఇక్కడ ఎందుకున్నాము? మనం ఎందుకోసం వచ్చాము? దీనిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి.



**రెండవది** మనం లక్ష్యంపట్ల, ధ్యేయంపట్ల మనకుండే ఈ ఎఱుక, మన చుట్టూ ఉండే రకరకాల పరిస్థితుల వల్ల నీరుగారి పోకుండా, దారితప్పిపోకుండా, మరలి పోకుండా, కాపాడుకుంటూ, మనల్ని ఆకర్షణకు లోనుచేసే పరిస్థితులను కట్టడి చేసుకుంటూ, మన లక్ష్యానికి దూరం కాకుండా ఉండాలి. మన లక్ష్యం, దానిమీద మనం దృష్టిపెట్టడం రెండూ పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి మన లక్ష్యంపట్ల మనం నిజంగా జాగరూకతతో ఉన్నామా, లేక ప్రక్కకు లాగబడి దారి తప్పి పథభ్రష్టులమయ్యామా అని తెలుసుకోవడానికి, ప్రతిరోజూ మీరు ఏం చేస్తున్నారు? ఎక్కడికి పోతున్నారు? అనే విషయం చూసుకోండి.

**మూడవ అంశం,** ఏది మనలో ప్రేమను కలిగిస్తుందో ఆ సాంగత్యంలో ఉండటం, దానిమీద దృష్టి ఉంచడం, మనం మన లక్ష్యంపట్ల మనకు గల తదేకతను పెంపొందించే పనులు చేస్తున్నామా? నిజంగా అటువంటి పనులే చేస్తున్నామా? మన లక్ష్యంపట్ల మనం జాగ్రత్తగా ఉంటున్నామా? మన ధ్యేయం స్థిరంగా ఉందా? మనం దానిని గుర్తుపెట్టుకుంటున్నామా? లేదా మరచిపోతున్నామా? మీరు రోజు ఎలా గడుపుతున్నారు అనే దానిని గమనించండి – గత ఇరవై సంవత్సరాల సంగతి కాదు – అది అవసరం లేదు, ఒక్క రోజును పరిశీలించండి! మీరు ఒక్కరోజును మచ్చుకి తీసుకొని, మీరు ఎలా గడుపుతున్నారో పరిశీలించుకోండి. మిమ్మల్ని మీరు "నేనిక్కడకు ఎందుకు వచ్చాను? నేను ఏం చేస్తున్నాను? నేను ఏం ఆశిస్తున్నాను?" అని రోజుకు ఒక్కసారైనా ప్రశ్నించుకుంటున్నారా? "మేమిక్కడకు ఆత్మవిచారణ కోసం, రమణ మహర్షి కోసం, భగవానుల కోసం, అరుణాచలేశ్వరునికోసం, బాబా కోసం, గురువుగారూ, మీ కోసం" ఇక్కడకు వచ్చామనో అనవచ్చు. అయితే వచ్చి మీరిప్పుడు ఎన్ని గంటలు లేదా ఎన్ని నిమిషాలు – **"గంటలు" అనడం మరీ ఎక్కువేమో - ఎన్ని నిమిషాలు మీరు నిజంగా ఆ విషయం మీద దృష్టి పెట్టి గడిపారు?** నిజాయితీగా సమాధానం చెప్పండి. పోనీ, గడిచిన ఇరవైనాలుగు గంటల్లో మీ లక్ష్యం కోసం మీరేం చేశారు?

ఆలోచించండి మీరు ఇక్కడెందుకున్నారు? మీరు మీ లక్ష్యాన్ని, మీ ధ్యేయాన్ని గుర్తు పెట్టుకుంటున్నారా? మిమ్మల్ని మీ లక్ష్యం నుండి దూరం చేసే ఇతర ప్రభావాల నుండి, ఆకర్షణల నుండి, కార్యకలాపాల నుండి మిమ్మల్ని కాపాడుకోవడానికి నిజంగా ప్రయత్నిస్తున్నారా? మీరు నిజంగా మీ లక్ష్యంవైపు, ప్రేమించే మీ ధ్యేయంవైపు అడుగులేస్తున్నారా? అలా అయితే అందుకోసం నిజంగా మీరేం చేస్తున్నారు? చివరిది, నేను పదే పదే చెప్పేటటువంటిది, మనమందరం గుర్తుపెట్టుకోవాల్సిన ప్రాథమికమైన, అత్యంత **ముఖ్యమైన విషయం : జీవితం యొక్క అల్పత్వం - ఎంత చిన్నది ఈ జీవితం! మీరుసమయాన్ని ఎలా గడుపుతున్నారో, ఎలా వృథా చేస్తున్నారో చూడండి.** రేపు మనం ఎక్కడుంటామో మనకు తెలియదు. అయినప్పటికి మనం శాశ్వతమైనట్లు, అజరామరులమైనట్లు సృష్టి లయించే వరకు ఉండబోతున్నా మనుకుంటూ ప్రణాళికలు వేసుకుంటూ, కూడబెట్టుకుంటూ, కాపాడుకుంటూ" ఇవన్నీ అవసరమా? స్పష్టమైన అవగాహన తెచ్చుకోండి.





# పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీ పూండీస్వామి

*సెప్టెంబర్ 2012*

శ్రీపూండీస్వామి సుమారు 1935 ప్రాంతంలో తిరువణ్ణామలైకి 20 మైళ్ల దూరంలో ఉన్న కలశప్పాక్కం గ్రామంలో ఉన్మత్తావస్థలో తిరుగుతూ కనిపించారు. ఆయన భారీ విగ్రహము, నడకలో ఠీవి, చూచేవారికి ఆయన ఒక మాజీ మిలటరీ అధికారిగా అనిపించేవారు. మొదట కలశప్పాక్కం లోని కాకంగరైపిళ్ళైయార్ కోవెలలోను, పాడుపడిన మసీదులోను, కొన్నాళ్లు ద్రౌపదమ్మ కోవెలలోను, మరికొన్నాళ్లు చెట్ల క్రింద, రోడ్డు ప్రక్కన ఉంటూ ఉండేవారు. పైనుండిమోకాలి క్రిందదాకా కఫ్నీని పోలిన చొక్కా వేసుకొనేవారు. దానిని తీసివేసేవారు కాదు. అది చిరిగి శిథిలమైతే ఎవరైనా వేరే చొక్కా వేస్తే ఆ చిరిగిన చొక్కాపైనే వేయించుకునేవారుగాని, పాతది విడిచేవారు కాదు. ఆ చొక్కా జేబుల నిండా పారవేసిన ఖాళీ సిగరెట్‌పెట్టెలు, చెత్తకాగితాలు, సిగరెట్‌పీకలు, మొదలైన చెత్తంతా కుక్కుకునేవారు. ఎవ్వరినీ ఏమీ అడిగేవారు కాదు. అన్నం, మంచినీళ్లతో సహా! ఎవరైనా పెడితే పసిబిడ్డకుమల్లే నోట్లో పెట్టి తినిపించవలసిందేగాని తనకై తాను చేతితో తినేవారు కాదు. ఎవరైనా సిగరెట్ నోట్లో పెట్టి వెలిగిస్తే పొగపీల్చేవారు. తానుగా ఎవరితోను మాట్లాడేవారు కాదు. స్నానం, తైలసంస్కారం లేక వెంట్రుకలు జడలు కట్టి ఉండేవి. ఒళ్లంతా మురికిగా వుండి ఈగలు ముసురుతుండేవి. అయినా అవేమి పట్టించుకునేవారు కాదు. నడవడం మొదలిడితే అలా మైళ్లు మైళ్లు నిలబడకుండా నడుస్తూనే ఉండేవారు. కూర్చుంటే వారాలు, నెలలు ఇక లేవనే లేవరు. మళ్లీ ఏదో ప్రేరణ వచ్చి లేచారా ఇక మళ్లీ కూర్చోవడం ఎప్పటికో! ఆయన ఎప్పుడు కూర్చుంటారో, ఎప్పుడు లేస్తారో, ఎప్పుడు ఎక్కడ ఉంటారో, ఏమి చేస్తారో, ఏమి చేయరో ఎవరికీ ఊహించడానికి సాధ్యమయ్యేది కాదు. ఆయన ఎవరో, ఆయన ఊరేమో, ఎక్కడినుండి వచ్చారో, కులమతాలు, తల్లిదండ్రుల గురించిన వివరాలు ఎవ్వరికీ తెలియవు. ఆయన భగవన్నామం స్మరిస్తుండగాగాని, ఆధ్యాత్మికప్రసంగం చేయగాగాని ఎవ్వరూ చూడలేదు.

మొదట మొదట కలశప్పాక్కం గ్రామస్తులు ఆయన్నొక పిచ్చివాడనే అనుకొన్నారు. ఒక విచిత్ర సంఘటన ద్వారా ఆయన పిచ్చివాడుకాదని, అవధూతస్థితిలో తిరుగుతున్న మహా సిద్ధపురుషుడని వారు గుర్తించారు. కలశప్పాక్కం ప్రక్కగా చెయ్యార్ అనే ఒక గొడ్డేరు ఉంది. శ్రీస్వామి అప్పుడప్పుడు ఆ ఏట్లోని ఇసుకపై కూర్చుంటూ ఉండేవారు. కూర్చుంటే వారాల తరబడి లేవకుండా కూర్చునిపోవడం స్వామివారికి సహజమేనని ఇంతకుముందు చెప్పుకొన్నాము. ఎర్రటి ఎండకి, కణకణకాగే ఆ ఇసుకలో మామూలుగా నడవడానికే కష్టం. అటువంటిది అంత ఎండలోను హాయిగా పండువెన్నెట్లో పరుపుమీద కూర్చున్నట్లు కూర్చునేవారు. ఒకసారి వర్షాలు పడి ఆ గొడ్డేరుకి హఠాత్తుగా వరద వచ్చింది. హఠాత్తుగా వరద రావడం,

నీళ్లు లేకుండా హఠాత్తుగా తగ్గిపోవడం ఆ గొడ్డేటికి రివాజే. వరదకు ముందు ఏట్లో కూర్చొని ఉన్న స్వామిని చూచినవారు పిచ్చిస్వామి వరదలో కొట్టుకుపోయారని అనుకొన్నారు. వరద తగ్గిన తరువాత చాలామంది గ్రామస్తులు స్వామి కూర్చున్న ప్రాంతాలలో చూడగా స్వామి శరీరమంతా ఇసుకలో కూరుకుపోయి తల మాత్రం పైకి కనిపిస్తూ ఉంది. ఇసుకంతా తోడేసిన తరువాత స్వామి చక్కా అక్కడనుంచి లేచి వెళ్లిపోయారు. అంత వరదలో మునిగిపోయి కూడా ఆయన చెక్కు చెదరకుండా ఉండడం కళ్లారా చూసిన గ్రామస్తులకు ఆయన సామాన్యుడు కాదనీ, గొప్ప సిద్ధపురుషుడనీ తెలిసింది. ఈ సంఘటనతో స్వామి మహిమ క్రమంగా వ్యాపించడం ఆరంభించింది. ఈ సంఘటన వల్లే స్వామిని "ఆర్ట్ స్వామిగళ్" అని పిలిచేవారు. తమిళంలో 'ఆర్ట్' అంటే నది, ఏరు అని అర్థం!



ఆ తరువాత ఏటికి ప్రక్కనే వున్న శ్మశానం సమీపంలో స్వామికోసం ఒక పందిరి వేసారు. సుమారు 3 సం॥ల పాటు స్వామి ఎక్కువగా అక్కడే గడిపేవారు. ఆ గ్రామంలో ఉండే మాణిక్యనాయనార్ అనే అతనికి స్వర్ణయోగం పిచ్చి వుండేది. అతడికెందుకో స్వామికి బంగారం తయారుచేసే పద్ధతి తెలుసుననిపించి, స్వామిని దాని కోసం వేధించేవాడు. ఆ కోరిక మనసులో ఉంచుకొని రోజూ స్వామికి భోజనం పెట్టేవాడు. కాని స్వామి ఎప్పుడూ తనకా విషయము తెలియదనీ, "బంగారం చేయాలనుకొని మానభంగం కాబోకు" అని అనేవారు. వేచివేచి ఆ వ్యక్తి నిరాశను తట్టుకోలేక కోపంతో స్వామి మీద దౌర్జన్యం చేయబోయాడు. స్వామి మౌనంగా అక్కడ నుండి లేచి, ఆ ఊరికి రెండుమైళ్ల దూరంలో వున్న పూండీ వైపు సాగిపోయారు. ఈ సంఘటన 1960 ప్రాంతంలో జరిగింది. పూండీలో కూడా ఇలాగే తిరుగుతూ ఒకరోజున మెయిన్‌రోడ్డు ప్రక్కన ఉండే ఒక ఇంటి అరుగుపై కూర్చున్నారు. అంతే! ఆ కూర్చోవడం 1978లో మహాసమాధి అయ్యేంతవరకు (అంటే సుమారు 18 సంవత్సరాలు) ఆ అరుగుమీద నుండి లేవలేదు. శాస్త్రాల్లో చెప్పబడ్డ అజగరావస్థ అంటే ఏమిటో దానికి స్వామి సజీవ నిదర్శనం. ***– పూజ్యశ్రీ బాబూజీ విరచిత "పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీపూండీస్వామి" (జనవరి, 1988 'సాయిపథం' మాసపత్రిక) నుండి...***

**భక్తుడు :** గురువుగారూ! ఒకసారి స్వర్గీయ కంచి శంకరాచార్యులు "మేమంతా బల్బులమైతే పూండీస్వామి ట్రాన్స్‌మీటర్ లాంటివారు" అని అన్నారని విన్నాం. ఇప్పటికీ ఆయన ఆ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారా?

**గురువుగారు :** అవును, అది ఇప్పటికీ జరుగుతూనే ఉంది. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు పూండీ స్వామివారి గురించి మాట్లాడుతూ, "మేమంతా బల్బులమైతే పూండీస్వామి ట్రాన్స్‌మీటర్ లాంటివారు, అక్కడ స్విచ్ వేస్తేగాని ఇక్కడ బల్బులు వెలగవు" అని అన్నారు. అప్పుడప్పుడూ మనం లైట్లు ఆపేస్తాం లేదా ఏదైనా బల్బు కాలిపోతుంది, కానీ ట్రాన్స్‌మీటర్ మాత్రం అక్కడే ఉంటుంది. అక్కడున్న ట్రాన్స్‌మీటర్‌లో అది ట్రాన్స్‌మీటరు అని చూపించడానికి బల్బు ఉండదు – అదీ సమస్య! (గురువుగారు నవ్వుతూ..) ట్రాన్స్‌మీటరును చూసి అది పనిచేస్తుందా లేదా అని చెప్పలేం.



వెలుగుతున్న బల్బును చూసి, "ఆc, అవును, ట్రాన్స్‌మీటరు పనిచేస్తుంది" అని అంటారు. అప్పుడప్పుడూ బల్బు కాలిపోతే పోవచ్చు కాని ట్రాన్స్‌మీటరు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటుంది. ట్రాన్స్‌మీటరులా పనిచేయడం పూండీస్వామివారి అవతారకార్యం. అది జరుగుతుంది, అది ఇప్పటికీ జరుగుతూనే ఉంది. ట్రాన్స్‌మీటరు ఎన్నడూ ఫెయిల్ కాదు. శ్రీస్వామివారు ఎప్పటికీ ఫెయిల్‌కాని ట్రాన్స్‌మీటరులాంటివారు.

**భక్తుడు** : గురువుగారూ! మీరు పూండీస్వామివారిని దర్శించడానికి వెళ్లేటప్పటికే సాయిభక్తులా?
**గురువుగారు :** అవును, సాయిబాబానే నా గురువు.

**భక్తుడు** : పూండీస్వామి మీకు సహాయం చేసారా?

**గురువుగారు :** ఆయన వాచా ఏమీ చెప్పలేదు. కానీ ఆయన సన్నిధిలో నేను పొందిన అనుభవం నా యావత్తు జీవితాన్ని మార్చివేసింది.

**భక్తుడు** : పూండీలో ఆ అనుభవం తరువాత (ఏదో పొందాలన్న) మీ తపన పెరిగిందా లేక సమాధానపడిందా, లేక రెండూ జరిగాయా?

**గురువుగారు :** అది సమాధానపడింది.

**భక్తుడు** : సమాధానపడింది – అంటే ఆ తపన తీరిపోయింది. కానీ ఆ తపన అంతటితో ఆగిపోయిందా? ఇంకా ఇంకా ఆ అనుభవాన్ని పొందాలనే కోరిక మరి కలుగలేదా?

**గురువుగారు :** అవును, నేను దానిని అనుభూతి చెందుతూనే ఉన్నాను. నిరంతరమూ ఆ అనుభూతిలోనే ఉన్నాను. నిజానికి ఆ అనుభవాన్ని నేను మాటల్లో చెప్పలేను. ఏ శాస్త్రాలలోను దానిని వర్ణించడానికి సరిపోయే పదాలు దొరకలేదు. ఇటువంటి విషయాలను మనం అడగడంగాని, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంగాని చేయకూడదు. కొన్ని విషయాలను గురించి మాట్లాడేందుకు మన దగ్గర పదాలుండవు కేవలం విశదీకరించి చెప్పేందుకు మాత్రమే ప్రయత్నం చేయగలం.

**భక్తుడు** : పూండీస్వామివారి ప్రేమ ఎలా వ్యక్తమయ్యేది?

**గురువుగారు :** ఆయన ప్రేమ ఎంత గాఢమైనదంటే ఆయనకిక ప్రేమ తప్ప వేరే ధ్యేయమంటూ ఏమీ లేదు. ఆయనే ధ్యేయమై పోయారు. పూర్తి తదేకతతో అలా కూర్చుండిపోయారు. కనీసం ఒక్క అడుగైనా బయటపెట్టాల్సిన అవసరం లేనంతగా! ఆయన ఓ అద్దం లాంటివారు. ఉదాహరణకు, ఓ ఫొటోగ్రాఫర్ భయపడుతూ భయంభయంగా ఆయన దగ్గరకు వెళితే, స్వామి ముఖంలో దానికి తగినట్లుగా అలాంటి (గంభీర) భావమే కనిపించేది. తరువాత వ్యక్తి రాగానే ఆయన తీరు తక్షణం మారిపోయేది. ఆ వచ్చిన వ్యక్తి చనువుగా, సన్నిహితంగా మాట్లాడితే స్వామి కూడా చనువుగా, కులాసాగా మాట్లాడేవారు. ఆయనెప్పుడూ అద్దంలాగే ఉండేవారు. **ఆయన వ్యక్తం చేసే ఏ భావమైనా అది ఆయనది కాక ఆయన వద్దకు వచ్చిన వ్యక్తికి సంబంధించినదై ఉండేది. అసలు ఆయనకంటూ ఏ భావమూ ఉండేది కాదు -** ఆయన ఎంతో



పారదర్శకంగా (Transparent) ఉండేవారు. అంతటి పారదర్శకతలో ఆయన ద్వారా నేను బాబానే చూసాను. అందుకే ఎప్పుడూ నేను నాకు అనుభవాన్నిచ్చింది సాయిబాబానే అని చెప్తుంటాను. కనీసం, నాకు, బాబాకు మధ్య తెరలాగా పూండీస్వామి వున్నారని అనుకోవడానికి ఆయనక్కడ కనీసం తెరగా కూడా లేరు. అటువంటి పారదర్శకత నేను ఎక్కడా చూడలేదు.

**భక్తుడు** : ఇటువంటి పారదర్శకత ద్వారా ఆయన ప్రేమ వ్యక్తమయిందని మీరంటున్నారా?

**గురువుగారు : ఆయన ప్రేమ తమ దగ్గరకు వచ్చినవారు ఏమడిగితే దానిని ఇవ్వడం ద్వారా వ్యక్తమయింది. ఎవరైనా ఆరోగ్యం కోరుకుంటే ఆయన ఇచ్చారు,** ఆధ్యాత్మిక అనుభవం ఆశిస్తే దానిని ప్రసాదించారు. పరిపూర్ణానందం కావాలనుకుంటే దానినీ ఇచ్చారు. పిల్లలు కావాలనుకుంటే పిల్లలనిచ్చారు. అది ఏదైనా సరే. ఎవరు ఏమి కోరుకుంటే దానిని ప్రేమతో అనుగ్రహించారు. “నాది ముక్తి అనే డిపార్టుమెంటు – నువ్వు కేవలం ముక్తినే కోరుకోవాలి – ప్రాపంచిక విషయాలు నాకు సంబంధించినవి కావు” ఇలాంటి కట్టుబాట్లేవీ లేవు.

**భక్తుడు** : ఒకరు ఒక మహాత్ముని పట్ల, ఇంకొకరు మరొక మహాత్ముని పట్ల ఆకర్షితులవుతారు. ఇలా ఎందుకు జరుగుతుంది? ఆ ఎంపికను నిర్ధేశించేదేమిటి?

**గురువుగారు :** అలాంటిదేమీ లేదు. అది నీ ఎంపిక కాదు. నిజానికి పూండీకి వెళ్లడమనేది నా ఎంపిక కాదు. అసలు ఆయన అంతటి మహాత్ముడని కూడా నేను అనుకోలేదు. అప్పటికి నాకు ఆయన గురించి ఎటువంటి భావమూ లేదు. నాకు కనీసం ఆ ఆసక్తి కూడా లేదు. నేను నా ప్రయాణాన్ని మొదలుపెట్టాల్సి ఉంది. అప్పుడు మా గురువుగారు “పూండీకి వెళ్లి అక్కడ కొద్దిరోజులుండి తరువాత నువ్వెక్కడికి వెళ్లాలనుకుంటే అక్కడకు వెళ్లు” అన్నారు. అంతే! పూండీస్వామి ఎలా ఉంటారు అన్న విషయంలో నాకసలు ఎటువంటి ఊహా లేదు.

**భక్తుడు** : గురువుగారూ! ఎవరైనా ఒకరి వద్దకు కాకుండా వేరొకరి వద్దకు వెళ్లారంటే అలా తీసుకువెళ్లేది – నిన్న మాట్లాడుకున్నట్లు కర్మసంబంధమేనా?

**గురువుగారు :** అవును, ఆయనతో నాకు కర్మసంబంధం ఉంది. అంతే కాకుండా, తమ గురువు యొక్క స్థితి గురించి బాబా చెప్పిన వివరాలు సరిగ్గా పూండీస్వామితో సరిపోయాయి. బాబా గురువు పూండీస్వామి అని నేననడం లేదు. కానీ బాబా తమ గురువు గురించి చెప్పిన వివరాలు సరిగ్గా పూండీస్వామి వివరాలతో సరిపోతున్నాయి.

**భక్తుడు** : అది ఎలా?

**గురువుగారు :** బాబా జీవితచరిత్ర చదవండి. స్వామి సాయిశరణానందతో బాబా తమ గురువృత్తాంతం చెబుతూ, “.... నా గురువు అలా కూర్చునే ఉండేవారు, వారు మూర్తీభవించిన ప్రేమ స్వరూపం.



ఆయన కనీసం తమ కాలకృత్యాల గురించి కూడా పట్టించుకునే స్థితిలో ఉండేవారు కాదు. నేను ఆయన శరీరాన్ని శుభ్రం చేసి, ఆహారాన్ని పెట్టి ఆయునను సేవించుకునేవాణ్ణి" అన్నారు. పూండీస్వామిని తప్పించి, బాబా చెప్పిన ఈ వర్ణనకు సరిపోయే వేరొకరిని చూపించండి చూద్దాం. నా వరకు నేను పూండీస్వామిని తప్పించి అటువంటి వారిని వేరెవరినీ చూడలేదు! పూండీస్వామి ఎప్పుడూ తమకై తాము చేతితో తినేవారు కాదు. ఎవరైనా నోట్లో పెట్టి తినిపించాల్సిందే. ఆయనకు ఎవరూ తినిపించకపోతే ఆయన అలా కూర్చుని ఉండేవారు. అంతే! ఎవరైనా ఆహారాన్ని నోట్లోపెడితేనే ఆయన తినేవారు. అంతా ఇంతా అనిగాక ఎంతమంది ఎంత పెట్టినా – అది వందమంది అయినా సరే– ఆయన తింటూనే ఉండేవారు. ఆ తిన్న పదార్థమంతా ఏమయ్యేదో అది మనకు తెలియదు. ఆయన చేతిలో నువ్వేమైనా పెట్టావనుకో, ఎవరో ఒకరు వచ్చి దానిని తీసి ప్రక్కన పెట్టేదాకా దాన్ని ఆయన అలా చేతిలోనే ఉంచుకునేవారు. ఎవరైనా సిగరెట్ నోట్లో పెట్టి వెలిగిస్తే పొగపీల్చేవారు. ఒకవేళ సిగరెట్టును ఆయన చేతిలో పెడితో దానిని అలాగే ఉంచేసేవారు, దానిని వాడేవారు కాదు. కాలకృత్యాలు కూడా అక్కడే తీర్చుకునేవారు, వేరేవారు వచ్చి శుభ్రం చేయాల్సిందే. ఆయన ఆహారం కోసం ఎన్నడూ భిక్ష చేయలేదు. ఎవరూ ఆహారం ఇవ్వకపోతే – అది నెలల తరబడైనా సరే – ఆయన అలానే ఆహారం లేకుండానే ఉండేవారు. ఎవరికైనా ఏ విధమైనటువంటి అవసరాలూ లేకపోతే ఎలా ఉంటారో దానికి పరిపూర్ణమైన ప్రతీక ఆయన. కనీస శారీరకావసరాలతో సహా అన్ని అవసరాలకు ఆయన అతీతులు.

**భక్తుడు :** అందరికీ తెలిసినంతవరకు ఆయన ఎప్పుడూ ఇలానే ఉండేవారా? ఆయన ఇంకోరకంగా ఉన్న రోజులు ఎవరికైనా తెలుసా?

**గురువుగారు :** అలాంటి సందర్భం ఎవరికీ తెలియదు. ఆయన అలానే కన్పించారు. మొదటినుండి ఆయన అలానే ఉండేవారు. ఆయన నడవడం మొదలిడితే సుమారు ఓ నెలరోజుల పాటు ఎక్కడా ఆగకుండా కలశప్పాక్కం, పూండీ, చెయ్యార్‌నది, ఆ చుట్టుప్రక్కల అలా నడుస్తూనే వుండేవారు. రాత్రింబవళ్ళు నడుస్తూనే వుండేవారు. ఏదైనా బాహ్యమైన ప్రేరణ కలిగి కూర్చున్నారా ఇక కూర్చుండిపోయేవారు – ఆ ప్రేరణ ఏమిటన్నది మనకు తెలియదు. ఎక్కడా నమోదు కాలేదు. ఆయన ఒకే ప్రదేశంలో నెలల తరబడి కూర్చునేవారు. ఏదో కారణం చేత ఆయన లేచారా ఇక నడక కొనసాగుతూనే ఉండేది.

**భక్తుడు :** గురువుగారూ! మీరు మీ అనుభవాన్ని పూండీస్వామి సన్నిధిలో పొందినపుడు మీరు దానిని బాబాకి ఎందుకు ఆపాదించారు?

**గురువుగారు :** నేనెప్పుడూ దానిని బాబాకు ఆపాదించి చెప్పలేదు. ఆ అనుభవం బాబా ద్వారా వచ్చిందని చెప్పాను. నేనెప్పుడూ "ఆపాదించి" చెప్పలేదు. అది బాబా ద్వారా వచ్చిందని నాకు తెలుసు.



**భక్తుడు** : అలా అయితే మరి అందులో పూండీస్వామివారి పాత్ర ఏమిటి?

**గురువుగారు :** నేను మీతో పోషిస్తున్న పాత్ర లాంటిదే – ఓ స్పూన్‌లాగా, సూప్‌ను మీరు స్పూన్‌తో తీసుకుంటారు కాని, ఆ సూప్‌ను తయారుచేసిందెవరు? ఆ సూప్‌ను మీకు ఇచ్చిందెవరు? అసలు ఆ సూప్ ఏమిటి? స్పూను కేవలం సాధనం మాత్రమే. ఆ స్పూన్‌ను సరిగ్గా ఎలా వాడుకోవాలో మీరు తెలుసుకోవాలి. మీకు సూప్‌ను ఇచ్చేది స్పూన్ అనుకుంటే ఒకసారి ఆ స్పూన్‌ను కొరికి చూడండి. పళ్లు ఊడుతాయి – అంతే! (గురువుగారు నవ్వుతూ) మీకు నేను ఏమీ చెయ్యట్లేదని అందుకే ఎప్పుడూ చెబుతుంటాను. నన్ను స్పూన్‌లాగ ఉపయోగపెట్టుకోండి. నేను స్పూన్‌లాగా వున్నాను, నన్ను సరిగా ఉపయోగించుకోండి. ఇచ్చేది బాబానే.

**గురువుగారు :** పూండీస్వామి వద్ద నేను పొందిన అనుభవాన్ని నేను చెప్పడం కంటే, ఆ అనుభవాన్ని మీరూ పొందడానికి ప్రయత్నిస్తే బాగుంటుంది. మీరు ఇక్కడ నా దగ్గర అనుభూతి చెందేది బహుశా ఆ అనుభవం యొక్క అంచులు మాత్రమే. మీకు నిజంగా తెలుసుకోవాలనుకుంటే ఆ అంచును పట్టుకుని ముందుకెళ్ళండి. సాగిపోండి! అందులో మునగండి, అప్పుడు మీరు దానిని అనుభూతి చెందగలరు. అప్పుడు ఆ అనుభవం ఎలా ఉందో మీరే నాకు చెప్తారు (గురువుగారు నవ్వుతూ) నాకు కూడా మీ నుంచి వినాలని ఆసక్తిగా ఉంది. అలా కాకుండా, ఇటువంటి విషయాలు నేను వివరించడం మొదలుపెడితే అది సిద్ధాంతాలకు, అంధవిశ్వాసాలకు, మీకు ఇంకా ఎక్కువ ఊహలు కల్పించడానికి దారితీస్తుంది. అది మీకు మంచిదనిపిస్తే చెప్పడానికి నాకు ఇబ్బందేం లేదు. కానీ దానివల్ల ఉపయోగం లేదు. నిజంగా అది జరిగినా, జరగకపోయినా, అది నిజమైనా కాకపోయినా ఇప్పుడు – ఇక్కడ మీరు మీ అనుభవాన్ని విశ్వసించండి. మీరు ఏదైనా అనుభవాన్ని పొందుతున్నట్లయితే, అది ఆ అనుభవం యొక్క అంచైనా సరే, దానిని అంటిపెట్టుకోండి.

## ఆధ్యాత్మిక కమ్యూనిజం

కమ్యూనిజానికి ఆయువుపట్టు సమదృష్టి, సమానత్వం. అసమానతలు రూపుమాపడంలో శ్రీసాయిబాబాకు సాటి మరెవ్వరు! గురువుగారిని ఓ కమ్యూనిస్టు... కమ్యూనిజం గురించి అడిగినదానికి "సాయి 'కమ్యూనిజాన్ని' నిర్వర్తించిన విధంగా ఈ విశ్వ చరిత్రలో ఎవ్వరూ నిర్వర్తించి ఉండరు అంటూ... "ఎవరయ్యా! సాయికన్నా నిజమైన కమ్యూనిస్టు" అన్నారు. సాయితత్వంలో సమానత్వాన్ని కొన్ని కోణాల్లో దర్శిద్దాం.

ఆకలిగొన్న ప్రాణులు అవే సహజంగా ఆహారం కోసం అన్వేషిస్తాయి. ఆహారాన్ని వాటికందుబాటులో ఉంచడమే మనం చేయాల్సింది. ఆకలిగొన్న ఒక జీవికి ఆకలి తీరితే ఆ జీవిలో ప్రాణస్వరూపుడై ఉన్న 'బాబా' సంప్రీతుడవుతారు. సర్వజీవ స్వరూపుడైన బాబా సంప్రీతుడయితే సర్వ ప్రాణులకు అన్నం పెట్టిన ఫలితం మనకు సహజంగానే వస్తుంది కదా! ఇదే రోజూ లక్షలాది అతిథులను ఆదరించినట్లే! అన్న బాబా



మాటల్లోని అంతరార్థం. నేనే ప్రపంచమంతటా (వివిధ రూపాల్లో) సంచరిస్తున్నాను. అన్నీ నేనే "సర్వ ప్రాణుల రూపంలో సంచరించే నన్ను గుర్తించి, ఆ గుర్తింపుతో ఎవరైతే నడుచుకుంటారో వారు నాకెంతో ఆప్తులు" అని బాబా తమ విరాట్ స్వరూపాన్ని వాచా వివరించడమే గాక, తాము అన్ని జీవుల రూపంలో ఉన్నామని ఎందరో భక్తులకు నిదర్శనాపూర్వకంగా నిరూపించారు బాబా. కేవలం భిక్షతోనే జీవించిన బాబా, భిక్ష ద్వారా వచ్చిన పదార్థాలను మసీదులోని మట్టి పాత్రలో (కొలంబా) ఉంచేవారు. ఈగలు, చీమలు, మూగజీవులు... పనిమనిషి యదేచ్ఛగా తమకు కావలసినంత తీసుకుపోయేవి. ఇలా ఆయన భిక్షపై ఇతర భిక్షువులు ఆధారపడి ఉండేవారు. జీవిత పర్యంతం బాబా భిక్ష చేసినది ఆయన కోసంగా కాక, ఆయనపై ఆధారపడ్డ జీవుల కొరకే.

ఇలా మనం తయారుచేసుకున్న ఆహారం నుండి మూగజీవులు, పనివారలు తమకు కావలసినంత తీసుకునే స్వేచ్ఛను మనమీయకున్నా, మనమే తగు సమయంలో ఆహారాన్నిచ్చే సహృదయత – మనం నిత్యం చేసే సచ్చరిత్ర పారాయణం ద్వారా, సాయి మనన, స్మరణాదుల ద్వారా అలవడాలి. అప్పుడే మనం సాయి ఆశించిన సర్వజీవ సమానత్వానికి విలువనిచ్చినట్లు.....

* * *

ప్రతి చిన్న ప్రాణికి ఆహారం ఇవ్వాలని వైదిక సారస్వతం బోధిస్తున్నది. ఆకలిగొన్న జీవులు ఆహారం కోసం అన్వేషిస్తుంటాయి. వాటికి అందుబాటులో ఆహారం ఉంచడమే మనం చేయవలసింది. దీన్ని పెద్దల ఆచరణలో చూద్దాం. మన వెనుకటి తరాల వారు ముగ్గు వేయడానికి బియ్యపుపిండిని వాడేవారు. అలా ఇంటికి శోభ, అటు అల్పజీవులైన చీమలకు, చిన్న కీటకాలకు, ఎన్నో జీవులకు ఆహారంగా ఉపయోగపడేది. వారికి ఆనందమూ కలిగేది. అంటే మనిషి లేస్తూనే పరహితం చేస్తున్నాడు. ఉదయం నిద్ర లేవడంతోనే సర్వాంతర్యామి అయిన భగవంతునికి నివేదనతో నిత్యకృత్యం ప్రారంభం. సత్కార్యమైన ఈ అంశం యొక్క అర్థం, అంతరార్థం తెలుసుకోక కేవలం మన ఆనందం కోసం మన ఇంటిముందు పలు రకాల రంగులతో (Chemicals), బియ్యపుపిండి బదులు సున్నపురాతి పొడిని ఉపయోగిస్తున్నాం. దీని వలన చీమలు మొదలగునవి మరణిస్తున్నాయి. అందుకే గురువుగారు చెప్పే "అర్థం తెలుసుకొని చేయండి ఏ పనైనా" అన్నమాటలు.

రైతు ఆరుగాలం శ్రమించి తన పంటపొలంలోని పంటను తెచ్చిన వెంటనే కంకులను కట్టగా కట్టి ఇంటిముందు వేలాడగట్టేవారు. ఎందుకంటే పిచ్చుకలకు, పక్షులకు ఆహారంగా భగవంతుడిచ్చిన పంటకు (ఫలితానికి) కృతజ్ఞతగా మొదటి నివేదన. ఇలా **మన నిత్యకృత్యం ద్వారా అన్ని జీవులకు ఆహారం నివేదితమైతే అన్ని రూపాలలోని ఆ సర్వాంతర్యామి సంతోషిస్తాడు. ఇదే బాబా చరిత్ర అంతా మనకు బోధించినది.**

* * *

ఎందుకండీ ఊరికూరికే అన్ని చార్జీలు  పెట్టుకొని శిరిడీకి పోవడం, బాబా అంతటా వున్నారు కదా, సర్వత్రా వున్నానని బాబానే చెప్పారు కదా! ఆ డబ్బుతో పేదవారికి అన్నం పెట్టవచ్చు కదా అని అడిగిన ఆయనకు... "అంతటా, అన్నిటా బాబా ఉన్నారు, ఆకలిగొన్న జీవికి అన్నం పెడితే బాగుంటుంది" అని అంటే "ఆ విషయం నేర్చుకోవడానికే నేను శిరిడీ పోతున్నానని" చెప్పా. అలా సాయిని తెలుసుకోవడానికి కాకుండా, మిగిల్చిన ధనంతో ఏ జీవికైనా పట్టెడన్నం పెడుతున్నారా? పోనీ ఈ మాట అడుగుతున్న మీరు పెడుతున్నారా? ఎప్పుడన్నా పెట్టారా? చూడండి. ప్రశ్నలు అడుగుతుంటారు. ఏం శిరిడీకే పోవాలా? బాబా ఇక్కడ లేరా అంటూ.... ఆకలిగొన్న జీవికి ఆ అడిగినవారు ఎప్పుడన్నా 1000రూ. కాదు, 50 రూ. పెట్టి సహాయం చేసారా? గమనించుకోండి. మిగుల్చుకున్న ఆ ధనం ఎంత సద్వినియోగం చేస్తున్నామో ఆలోచించి చూడండి ఒక్కసారి. శిరిడీకి రావడం ఎందుకు అని అంటే, సర్వత్రా ఉన్న ఆయన్ను దర్శించడం నేర్చుకోవడానికే. మనకు ఇప్పుడు రకరకాల బలహీనతలు, వ్యామోహాలున్నాయి. అబద్దాలు చెబుతున్నాం. వీటిని చూసి మనం సిగ్గుపడుతున్నాం. వీటిని పోగొట్టుకోవాలి. ప్రతి మనిషి వాడి బలహీనతలను పోగొట్టుకోవడం కోసం తపన పడుతూనే ఉంటాడు. కొంతమంది కొంతవరకు సఫలీకృతులవుతారు. కొంతమంది కాలేరు. సఫలీకృతులు కాలేననటువంటివారు దాన్ని పొందడానికి, వాటిని పోగొట్టుకోవడానికి బలం సంపాదించుకోవడం కోసం ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నమే ఇది. పవిత్ర క్షేత్రాలను, మహాత్ముల సాన్నిధ్యాలను, మహాత్ములను దర్శించడం అవి పోగొట్టుకోవడాననికే మనం శిరిడీ పోవాలి" అంటారు శ్రీబాబూజీ. శ్రీసాయిని ఆమూలాగ్రం అవగతం చేసుకుంటే సర్వజీవులలోను సాయియే గలడన్న సమానత్వ భావన ఏదో ఒకరోజుకు సాధ్యమవ్వగలదు.

* * *

మన ఇష్టాలతో బాబాను పూజించడం కాక, బాబాకు ఇష్టమైన రీతిలో సేవ చేయగలగడం పరివర్తన, పరిణమాలు, పరిణితి అవుతుంది. బాబాను పూలమాలలతో అలంకరించడం మన ఇష్టం కోసంగా అయితే, ఆకలైనవారికి అన్నం, దాహార్తికి నీరు, బట్టలు లేని వారికి బట్టలు, నీ వద్దకు వచ్చిన జీవిని ఆదరించుట. ఇత్యాదుల ఆచరణే బాబాకు నిజమైన పూదండ అంటారు బాబూజీ. మన నిత్యకృత్యం పూజగా జరగడం కోసంగా మన పెద్దలు చెప్పిన జీవన సూత్రాలను పాటించడం. వాటి అర్థం – అంతరార్థాలను తెలుసుకొని పాటించడం వలన ఆనందాన్ని ఆస్వాదించగలం. అందుకే అన్నారు శ్రీసాయి "ఆకలిగొన్న జీవులకు ఆహారాన్ని ... బట్టలు లేని వారికి బట్టలను ఇవ్వండి. భగవంతుడు సంప్రీతుడవుతాడు".


*లోపల ఎటువంటి చింతలు లేకుండా, ఎటువంటి ఆందోళన లేకుండా ఆయనే చేస్తారు, ఆయనే నడిపిస్తారు అని నిశ్చింతగా వుండడమే ఊరక కూర్చోవడం... ఇదే బాబా ఉపాసనకి చెప్పింది. "ఊరక కూర్చో చేయవలసినదంతా నేను చేస్తాను". ఇది అవగాహన ఉంటేనే సాధ్యమవుతుంది. అట్టి అవగాహన పెంచుకోవడమే కావలసింది. దీనికి ఆయనిచ్చిన ఉపకరణమైన సత్సంగానికి క్రమం తప్పకుండా వెళ్లడం... ఆయనను ఆరాధించడమే అవుతుంది.*

# పూదండ



"ప్రేమ వ్యక్తీకరణకు ఆర్థిక స్థోమత
కొలమానం కాకూడదు.
స్థోమత కలవారు పూలదండలు
వేయగలుగుతున్నారు.
అది చూసి స్థోమత లేనివారు తాము
వేయలేకపోతున్నందుకు లోలోన
కుమిలిపోతున్నారు.
అది మీకు ఆనందాన్నిస్తుందా?
ఆ పూలదండకు ఖర్చు చేసే 50 రూపాలతో
పేదవారికి రోజంతా గడుస్తున్నది.
నన్ను నిజంగా సంతోష పెట్టాలని ఉంటే
ఆ డబ్బుతో వారికి ఒకపూట అన్నం పెట్టండి.
లేదా నలుగురికి ఉపయోగపడేదేదైనా చేయండి.
బాబా సంప్రీతులవుతారు. నలుగురికి సహాయపడుతూ
ఆపదలో, కష్టాలలో అండగా నిలవడమే
శ్రీసాయికి మనం అర్పించే నిజమైన పూదండ".

- శ్రీబాబూజీ


ఏది దైవం... ఏది ధ్యానం...
ఏది ముక్తికి మేటి మార్గం?
సాయి ఊసే... సాయి ధ్యాసే...
లేదు లేదిక వేరే బాట...